

దర్శించండి - తరించండి

స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం

కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.

సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...

శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి

శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్

A/c No. 30178925930, IFSC No. SBIN0010105

మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 304 | ది. 14-2-2026 | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 304 | Date : 14-2-2026 | Saturday | Pages : 8 | Rs.1/- |


## గవర్నర్ తో డిప్యూటీ సీఎం భేటీ



**విజయవాడ, ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ ని ఈ రోజు సాయంత్రం విజయవాడలోని లోక్ భవన్ లో ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ మర్యా దపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బడ్జెట్ సమావేశాల్లో గౌరవ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపారు.

# సంక్షేమం- అభివృద్ధి సమతూకం

● గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

● 20 నెలల్లో ఎంతో చేశాం..భవిష్యత్తులో మరింత చేస్తాం ● రూ. లక్ష కోట్లతో ఉద్యాన హబ్ గా రాయలసీమ అభివృద్ధి ● గాడిలో విద్యుత్ వ్యవస్థ -తొలిసారిగా విద్యుత్ ఛార్జీల ట్రూడౌన్ ● జనాభా నిర్వహణ కోసం ఈ సెషన్ లోనే పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ ● నల్లమల సాగర్ పై తెలంగాణ అభ్యంతరాలు ఎందుకు ● ఫ్యాక్షన్ మనస్తత్వంతోనే హెరిటేజ్ సంస్థపై ఆరోపణలు ● గత పాలనలో జరిగిన మద్యం స్కాంను సుప్రీం కోర్టు కూడా తప్పు పట్టింది

**అమరావతి,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** కూటమి అధికారంలోకి వచ్చాక సంక్షేమం- అభివృద్ధి సమతూకంగా సుపరిపాలన ప్రజలకు అందుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎన్నికల్లో వాగ్దానాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని గాడిలో పెట్టడంతో పాటు...అభివృద్ధి బాట పట్టించామని వెల్లడించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో భాగంగా అసెంబ్లీలో శుక్రవారం చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. గత 20 నెలలుగా కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. గత ప్రభుత్వ పాలన వల్ల కలిగిన ఇబ్బందులను ఎలా అధిగమించింది వెల్లడించారు. నాటి ప్రభుత్వం చేసిన దురాగతాలను ఎండగట్టారు. రాష్ట్రంలో అభివృద్ధి-సంక్షేమాన్ని అడ్డుకునేలా కొందరు కుట్రలు పన్నుతున్నారని సీఎం చంద్రబాబు శాసన సభలో అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."గత పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి పని చేశాయి. గత ప్రభుత్వ హయాంలో పాలకులు అసెంబ్లీలో అవమానించిన తీరుకు కన్నీళ్లు పెట్టుకున్నాను. 2019-24 మధ్య నాలాగే చాలా మంది కన్నీళ్లు పెట్టుకున్న పరిస్థితి. విశాఖ వెళ్తే పవన్ కల్యాణ్‌ను అడ్డుకున్నారు. గతంలో అరాచకాలు చేసిన వాళ్లు ఇప్పుడు నీతులు చెబుతున్నారు. ప్రజలు ప్రతీ అంశాన్నీ గమనిస్తూనే సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటారు. దాని ఫలితమే కూటమి అద్భుత విజయం. రాష్ట్రంలో జరిగిన విధ్వంసంపై



అధికారంలోకి వస్తూనే 7 శ్వేత పత్రాలను విడుదల చేశాం. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని ఆదుకున్న కేంద్రానికి ధన్యవాదాలు.

నెలకు రూ. 2,750 కోట్ల మేర ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌గా అందిస్తున్నాం. ఏడాదికి రూ.33 వేల కోట్ల మేర నిధులు వెచ్చిస్తున్నాం. తల్లికి వందనం స్కీం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఆర్థిక సాయం అందించాం. స్త్రీశక్తి పథకం ద్వారా ఇప్పటి వరకూ 43.5 కోట్ల ప్రయాణాలు జరిగాయి. దీపం 2.0 ద్వారా ఏడాదికి 3 సిలెండర్లు ఉచితంగా మహిళలకు అందిస్తున్నాం. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేల రూపాయలు మూడు విడతల్లో రైతులకు అందిస్తున్నాం. అన్న క్యాంటీన్లను అన్ని నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేస్తున్నాం. సమాజంలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారందరినీ ఆదుకునేలా సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నాం. పీ4 ద్వారా భవిష్యత్‌లో మంచి ఫలితాలు వస్తాయి. సంపద ఉంటేనే ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయగలం... సంపద పంచగలం. అందుకే జీరో పావర్టీ ద్వారా పేదరిక నిర్మూలన కార్యక్రమాన్ని రాష్ట్రంలో చేపట్టాం. అట్టడుగు స్థాయిలో ఉన్న వారికి చేయూత అందించేందుకు పీ4 కార్యక్రమం. పేదరిక నిర్మూలనకు సంబంధించి దేశంలోనే ఇది అత్యుత్తమ మోడల్."అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**పీపీపీతోనే ప్రగతి... పురోగతి..** "పీపీపీ వల్ల సంపద సృష్టి జరుగుతోంది. రోడ్లు, పోర్టులు, ఎయిర్ పోర్టులు ఈ విధానంలోనే నిర్మితం అవుతున్నాయి. పీపీపీ విధానంలో ప్రాజెక్టు నిర్మించి నిర్వహిస్తారు. నిర్దిష్ట కాలపరిమితి తర్వాత ప్రభుత్వానికి అప్పగిస్తారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. క్వాంటం నైపుణ్యాల కోసం కోర్సు నిర్వహిస్తుంటే 60 వేల మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రస్తుతం ఇంధన రంగంలో ట్రాన్సిషన్ సమయం నడుస్తోంది. హరిత ఇంధనానికి డిమాండ్ ఉంది. గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి సంబంధించి ఏపీ, మహారాష్ట్ర ఓ మోడల్ అవుతాయి. ఏపీలో ప్రొజ్యూమర్ విధానంలో ఇంధన ఉత్పత్తి చేయాలని భావిస్తున్నాం. సోలార్ ప్యానళ్లను ఇళ్లపై ఏర్పాటు చేసుకుని గ్రిడ్ కు అనుసంధానిస్తాం. సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజారోగ్య సేవలను విస్తృతం చేస్తాం. ఈ నెల 16 తేదీన బిల్ గేట్స్ రాష్ట్రానికి వస్తున్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో డిజిటల్ హెల్త్ రికార్డులను తయారు చేసి వ్యక్తిగత ఔషధాలను కూడా అందించే అవకాశం ఉంది. సంజీవని ప్రాజెక్టుపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలి. జనాభా నిర్వహణపై ఈ అసెంబ్లీ సెషన్లోనే పాలసీ తెస్తాం. డెమో గ్రాఫిక్ డివిడెండ్ ను సమర్ధంగా వినియోగించుకోవడం ద్వారా సంపద సృష్టించేందుకు అవకాశం ఉంటుంది. మెగా డీఎస్సీ హామీ ఇచ్చి ఏడాది లోగానే టీచర్లకు పోస్టింగులు ఇచ్చాం. కానిస్టేబుళ్ల నియామకాలు కూడా పూర్తి చేసి స్టైఫండ్ ను రూ.4,500 నుంచి రూ.12,500కు పెంచాం. భూమి ఇవ్వకుండా, ప్రోత్సాహకాలు ఇవ్వకుండా పరిశ్రమలు, ఉద్యోగాలు ఎలా వస్తాయి...? ప్రముఖ పరిశ్రమలకు భూములు ఇస్తుంటే కొందరు వివాదం చేసే ప్రయత్నం చేస్తున్నారు. పరిశ్రమలను ప్రోత్సహించేలా ఎస్క్రో ఖాతా ఏర్పాటు చేస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తో వేగంగా అనుమతులు ఇస్తున్నాం. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25.6 శాతం ఏపీకే వచ్చాయంటే ఏపీ బ్రాండ్ విలువ ఏమిటో అందరూ అర్థం చేసుకోవాలి. గత పాలకుల వేధింపుల కారణంగా అమర్ రాజా బ్యాటరీస్ పొరుగు రాష్ట్రానికి వెళ్లిపోయింది. విశాఖలో గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ పరిశ్రమలు వస్తున్నాయి. అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ కూడా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నాయి. రామాయపట్నం వద్ద బీపీసీఎల్ కూడా రూ.70 వేల కోట్లతో రిఫైనరీని ఏర్పాటు చేస్తోంది. భాగస్వామ్య సదస్సులో రూ.13.5 లక్షల కోట్ల పెట్టుబడులు 610 ఎంఓయులు చేసుకున్నాం. మొత్తంగా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 23 లక్షల ఉద్యోగాలు వస్తాయి. 20 లక్షల ఉద్యోగాలను ఐదేళ్లలో ఇస్తామన్న హామీని నిలబెట్టుకుంటాం."అని సీఎం స్పష్టం చేశారు.

## పాలక మండళ్లు బాధ్యతగా ఉంటే తిరుమలలో అపచారాలు జరిగేవి కాదు

● గతంలో జరిగిన తప్పులు పునరావృతం కారాదు ● రాజకీయాలకు అతీతంగా దేవాలయాలను పరిరక్షించుకోవాలి ● కూటమి ప్రభుత్వం ఆలయాల అభివృద్ధి, ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉంటుంది ● శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ మార్గాన్ని వర్చువల్ గా ప్రారంభించిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**విజయవాడ,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** పాలక మండళ్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తే దేవాలయాల్లో అపచారాలు జరగవని, రాజకీయాలకు అతీతంగా దేవాలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత పాలక మండళ్లపై ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమలలోనే ఎన్నో అపచారాలు జరిగాయన్నారు. నాటి పాలక మండలి బాధ్యతగా వ్యవహరిస్తే తప్పులు జరిగేవి కాదని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఆలయ పాలక మండళ్లు గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు, అపచారాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నూతనంగా నిర్మించిన శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ రోడ్డును వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి వర్చువల్ గా శుక్రవారం ఉదయం ప్రారంభించారు. సుమారు రూ. 10 కోట్ల అంచనా వ్యయంతో గిరి ప్రదక్షణ రోడ్డును నిర్మించారు. రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి , శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి , తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, దేవాదాయ శాఖ కార్యదర్శి డాక్టర్ హరి జవహర్ లాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "మన ఆలయాలు నాగరికతకు చిహ్నాలు. మన కళలు, మన వారసత్వం, మన సంస్కృతి, ధర్మ పరిరక్షణ ఆలయాలతో ముడిపడి ఉన్నాయి. అరుణాచలంలో గిరిప్రదక్షణ చేస్తారు అని తెలుసు. నాకు గిరిప్రదక్షణ చేయాలని చాలా కోరిక ఉంది. దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆహ్వానం మేరకు, భక్తుల కోరిక మేరకు త్వరలో శ్రీకాళహస్తి క్షేత్రాన్ని సందర్శించి కచ్చితంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటాను. శివరాత్రికి రెండు రోజుల ముందు ఈ శ్రీకాళహస్తి గిరి ప్రదక్షణ మార్గాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉంది. గత ప్రభుత్వం ఆలయాల పరిరక్షణ అంశాన్ని చాలా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దేవాదాయ మంత్రిగా రామనారాయణ రెడ్డి బాధ్యతలు స్వీకరించాక ఆలయాల పరిరక్షణను ఎంతో బాధ్యతగా ముందుకు తీసుకువెళ్తున్నాం. నిరాదరణకు గురైన ఎన్నో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నారు. భక్తులు కోరుకుంటే ఏజెన్సీలో కూడా ఆలయాలు నిర్మించాలన్న ఆయన గొప్ప సంకల్పానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

**శివరాత్రి తర్వాత గిరిప్రదక్షణ మార్గంలో మొక్కలు నాటుతాం..** శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ మార్గంలో గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రూ. 10 కోట్లు వెచ్చించి సిమెంటు రోడ్డు నిర్మించాం. 22 కిలోమీటర్ల గిరి ప్రదక్షణ మార్గాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. అటవీ శాఖ ఆధ్వర్యంలో గిరిప్రదక్షణ మార్గానికి ఇరు వైపులా మొక్కలు నాటే కార్యక్రమానికి శివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం శ్రీకారం చుట్టబోతున్నాం. శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ ద్వారా ప్రతి భక్తుడికి కైలాసగిరి ప్రదక్షణ చేసిన పుణ్యఫలం దక్కాలని ఈ సందర్భంగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

**రూ. 40 కోట్లతో 22 ప్రధాన ఆలయాలకు రోడ్లు..** గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారి మార్గ నిర్దేశకత్వంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతి అడుగులో మన సనాతన ధర్మ ఔన్నత్యాన్ని పరిరక్షించేందుకు కృషి చేస్తూ.. ఆలయాలు, ఆలయాలకు వెళ్లే రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం. ఆ ప్రక్రియలో భాగంగా దేవాదాయశాఖ సహకారంతో ఏలూరు జిల్లా ఐ.ఎస్. జగన్నాథపురంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయం ఉన్న కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డు రూ. 3 కోట్ల 70 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టాం. ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ పరిసరాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టాం.

## వైసీపీ హయాంలో రూ.4064.59 కోట్లు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు

● వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం ● ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదు ● వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్ గా మారింది ● శాసనమండలిలో వైసీపీని నిలదీసిన నిలదీసిన మంత్రి లోకేష్



**అమరావతి,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** వైసీపీ హయాంలో రూ.4064.59 కోట్లు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఉన్నాయి. వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదు. వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్ గా మారిందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నిలదీశారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలపై శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. ముందుగా మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ.. విపక్ష నేత బొత్స సత్యనారాయణ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు అన్న కాంటీన్లు మూసివేయబోమని సభలో చెప్పి మాటతప్పారని, ఇప్పుడు వైసీపీ పాలనలో ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు లేవంటూ నీతులు చెబుతున్నారని ఎత్తిచూపారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ.. మండలి వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు లేవని చెబుతున్నారు. 2020- 2021 ఏడాది క్యూ-4 పెండింగ్ 683.1 కోట్లు, 2023-24 క్యూ-2, క్యూ-3, క్యూ-4 బకాయిలు 1753.98 కోట్లు, 2023-24 ఏడాది గమనిస్తే.. ఎంటీఎఫ్ ఎరియర్లు కానీ చూస్తే సుమారు రూ.895 కోట్లు బకాయిలు పెట్టారు. వైసీపీ ప్రభుత్వంలో ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించినట్లు సభ్యులు చెబుతున్నారు. ప్రభుత్వం మారే సమయంలో రూ.645 కోట్ల బకాయిలు చెల్లించలేదు. నేను రికార్డెడ్ గా చెబుతున్నాను. విద్యాశాఖ మంత్రిగా మాట్లాడేందుకు నాకు హక్కు ఉంది. వైసీపీ రూ.4064.59 కోట్లు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెట్టి వెళ్లారు. దీనిని నేను టేబుల్ చేస్తాను. మీరు రెడీగా ఉన్నారా అని వైసీపీ సభ్యులను నిలదీశారు. దీనిపై బొత్స స్పందిస్తూ.. వైసీపీ హయాంలో రూ.4వేల కోట్ల బకాయిలు లేవని, రెండు వాయిదాలు మాత్రమే ఉన్నాయని చెప్పారు. ఇంటర్ విద్యను పట్టించుకోవడం లేదన్నారు. ఇందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నామని చెప్పారు.

**వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం..** నిజాలు చేదుగా ఉంటాయి. వైసీపీ సభ్యులు అబద్ధాలు చెప్పి బయటకు వెళున్నారు. ఇంటర్ విద్యపై దృష్టి పెట్టడం లేదంటున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 70వేల మంది విద్యార్థులు పెరిగారు. అదీ ఈ ప్రభుత్వ చిత్తశుద్ధి. వైసీపీ ఐదేళ్ల కాలంలో కనీసం పుస్తకాలు బ్యాగ్స్ ఇవ్వలేదు. మధ్యాహ్న భోజనం రద్దు చేసి వెళ్లిపోయారు. ఇప్పుడు మమ్మల్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదు. మేం ఇంటర్ లో మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించాం. పుస్తకాలు ఇస్తున్నాం. 10, ఇంటర్ విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నాం. వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్. ఈ తలుపు నుంచి వెళ్తారు. హాయిగా టీ తాగి ఆ తలుపు నుంచి వస్తారు. చిత్తశుద్ధి ఉంటే మా ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. మాకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే సమాధానం ఇస్తున్నాం. సమస్యలు లేవని మేం చెప్పడం లేదు. మేం వినేందుకు సిద్ధంగా ఉన్నాం. పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాం. గతంలో మాదిరిగా నోరు మూసివేయడానికి కాదు మేం ఇక్కడ ఉంది. మేం చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. పరదాలు కట్టుకుని మేం తిరగడం లేదు. అసెంబ్లీకి సీఎం గారు వస్తుంటే ప్రజలు నవ్వుతూ చేతులు ఊపుతున్నారు. గత సీఎం 3వేల మంది పోలీసులను పెట్టేవారు రోడ్లపైన. యుద్ధవాతావరణం ఉండేది. ఇప్పుడు ప్రశాంతంగా, హాయిగా తిరగలుగుతున్నాం. ఇదీ మా చిత్తశుద్ధి. విపక్ష నేతను పిలిపించాలి. ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదు. వైసీపీ హయాంలో 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరం అయ్యారు. ప్రశ్నించే హక్కు నాకు ఉంది. వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి చెప్పారు.

## సాగరమాల ద్వారా హార్బర్ల ఆధునీకరణ

● ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి ● ముత్యాలమ్మపాలెం మినీ జెట్టీపై ప్రీ-ఫీజిబిలిటీ అధ్యయనం ● శాసనసభలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ప్రశ్నకు సమాధానం చెప్పిన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, సాగరమాల వంటి కేంద్ర పథకాల సహకారంతో రాష్ట్రంలోని ఫిషింగ్ హార్బర్లను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆధునీకరిస్తున్నామని వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో పెందుర్తి శాసన సభ్యులు పంచకర్ల రమేష్ బాబు పరవాడ మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామంలో మినీ జెట్టి / ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో కోస్తా ప్రాంత అభివృద్ధి, ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల స్థితిగతులు, ముత్యాలమ్మపాలెం ప్రాజెక్ట్ పురోగతి గురించి స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. దీనికి సమాధానంగా వ్యవసాయ,మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రానికి 12 కోస్తా జిల్లాల్లో కలిపి 1053.07 కి.మీ తీరప్రాంతం ఉండగా, 350 ల్యాండింగ్ సెంటర్లు, ఫిషింగ్ హార్బర్లు గుర్తించబడ్డాయని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో 10 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టామని, 2020 సంవత్సరం జులై 15 నుంచి ఫిషింగ్ హార్బర్లు మత్స్యశాఖ నుంచి పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖకు బదిలీ అయ్యాయని పేర్కొన్నారు. తొలి దశలో జువ్వలదిన్నె, ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నం హార్బర్లు నిర్మాణంలో ఉండగా, రెండో దశలో బుడగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం, వోడరేవు హార్బర్లు ప్రతిపాదనలో ఉన్నాయని తెలిపారు. సాగరమాల, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సహకారంతో విశాఖ హార్బర్ ఆధునీకరణ పనులు రూ.178.51 కోట్లతో కొనసాగుతున్నాయని, కాకినాడ హార్బర్ ఆధునీకరణకు రూ.58.95 కోట్లతో సిద్ధం చేయడానికి అంగీకరించిందని వివరించారు. అలాగే ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల విషయంలో అంతర్వేది పల్లిపాలెం, గుండయపాలెంలో జెట్టీ సౌకర్యాలతో కార్యకలాపాలు సాగుతున్నాయని, భావనపాడు కు నది ముఖద్వారం స్థిరీకరణ కోసం అవసరమైన సాంకేతిక చర్యలను కు తెలియజేశామని చెప్పారు. కింద రూ.126.91 కోట్లతో దొండువాక, ఉప్పలంక, భీమిలి, రాజయ్యపేట, చింతపల్లి, రాయదరువులో ల అభివృద్ధి టెండరింగ్ దశలో ఉందన్నారు.

## రెండేళ్ల ప్రజా పాలనకు ప్రజల ఆమోద ముద్ర

● ప్రజా ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి ఈ ఫలితాలే నిదర్శనం ● రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**హైదరాబాద్,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రెండేళ్ల ప్రజా ప్రభుత్వ పాలనకు ప్రజల ఆమోద ముద్ర అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇది కేవలం రాజకీయ గెలుపు మాత్రమే కాదని, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై ఉన్న తిరుగులేని విశ్వాసానికి నిదర్శనమని శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. తమ స్వార్థ రాజకీయాల కోసం తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ ను దెబ్బ తీయడమే అజెండాగా పెట్టుకున్న శక్తులకు ఈ ప్రజా తీర్పు ఓ చెంప దెబ్బ అని వాఖ్యానించారు. ఓ వైపు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతూనే.... మరోవైపు అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల చెంతకు చేర్చాలన్న మా ప్రభుత్వ సంకల్పానికి ఈ ఫలితాలు నిదర్శనమన్నారు. ఈ గెలుపు ప్రభుత్వంపై బాధ్యతను మరింత పెంచిందని, ఈ స్ఫూర్తితో తెలంగాణను అన్ని రంగాల్లోనూ ఇతర రాష్ట్రాలకు ధీటుగా అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేసి తీరుతామన్నారు. అబద్ధపు ప్రచారాలను నమ్మకుండా, అభివృద్ధికి పట్టం కట్టిన ప్రజలకు.... ఈ ఎన్నికల్లో విజయం కోసం ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ మార్గ నిర్దేశనంలో, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో అహర్నిశలు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మంత్రి శ్రీధర్ బాబు ధన్యవాదాలు తెలిపారు.

# 18వ శతాబ్దం కాకతీయ రాజుల నిర్మాణం
# శ్రీ గంగా పార్వతి సమేత చంద్రశేఖర స్వామి వారి ఆలయం





**విస్సన్నపేట,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి వారి ఆలయం 18వ శతాబ్దం కాకతీయుల కాలంలో ఏలూరు మోతే సంస్థానాధీసులు, నూజివీడు జమీందారులు నిర్మించిన దేవాలయం అని పూర్వీకులు తెలియజేస్తున్నారు. నాడు 300 మంది బ్రాహ్మణోత్తములు కాశీ పుణ్యక్షేత్రం నుండి కాశీ విశ్వనాధుని అన్నపూర్ణమ్మ తల్లి ఆశీస్సులతో జోలె కావిడి ద్వారా నేలపై ఎక్కడా దించకుండా వంతులు వారీగా కాకులు దూరని కారడివి అయిన విసన్నపేటకు శివలింగశీను మోసుకొచ్చి ఆనాడు వేద పండితులు నిర్ణయించిన బ్రహ్మ ముహూర్తంలో ప్రతిష్టించినట్లు తెలుస్తోంది. నూజివీడు జమీందారులు అశ్వాలపై స్వారీ గా వచ్చి ఇక్కడ పూజలు చేసేవారని వారి ఏనుగులు కొండ పర్వ చెరువు నుండి కలువ పువ్వులు తీసుకువచ్చి పూజలు చేసేవని కథలగా ఇప్పటికీ చెప్పుకుంటూనే ఉన్నారు. మాజీ సర్పంచ్ కుక్కడపు ప్రసాదరావు సోదరుడు మాజీ శివాలయం ధర్మకర్త కుకడం శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ హయాంలో దాతల సహాయ సహకారాలతో 10 లక్షల రూపాయలతో గోపురాన్ని రీమోడల్ చేయడం జరిగిందని అదే సమయంలో చుట్టూ ఫ్లోరింగ్ అధునాతన విద్యుత్తు సౌకర్యాలు మినీ వాటర్ ట్యాంక్ తదితరాలను శివయ్య ఆశీస్సులతో ఏర్పాటు చేశామన్నారు. తాను పదవి అలంకరించినాడు 13 వేల రూపాయలు మాత్రమే గుడి ఖర్చులకోసం నిధులు ఉన్నాయని తాను రిజైన్ ఇచ్చే నాటికి నూతనంగా చార్జి తీసుకునే గోళ్ళ వెంకట గురునాధరావు సోదరుడు కోటేశ్వరరావుకు మూడు లక్షల రూపాయల వరకు స్వామివారి భక్తులు ఇచ్చిన కానుకలను అప్ప చెప్పటం జరిగిందన్నారు. ప్రస్తుతం ఎండోమెంట్ లో ఉన్నదని స్వామివారి భూములకు పాస్ బుక్కులు తయారీ కూడా తాను చేయించాను అన్నారు.

# శ్రీ గంగా పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి వారి కళ్యాణ ఉత్సవ వేడుకలు

## -ఆలయ చైర్మన్ వెంపటి శ్రీకృష్ణ జనార్ధన రావు



**విస్సన్నపేట,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో శ్రీ గంగా పార్వతి సమేత చంద్రశేఖర స్వామి వారి కళ్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ వెంపటి శ్రీకృష్ణ జనార్ధన రావు కార్యనిర్వహణ అధికారి వి దుర్గాధన ప్రసాద్ సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. 15వ తేదీ ఆదివారం త్రయోదశి మహాశివరాత్రి పర్వదినశీ సందర్భంగా ఉదయం ఐదు గంటల 15 నిమిషాలకు సుప్రభాత సేవ తీర్థ బిందె స్వామివారికి రుద్రాభిషేకం, ప్రాతః కాల మండపార్చన, అమ్మవారికి కుంకుమ పూజ సంస్కార హోమము బలిహరణ నీరాజనం మంత్రపుష్పం తీర్థ ప్రసాద వినియోగం సాయం సమయంలో 6:31 నిమిషాలకు ప్రదోషకాల పూజలు హోమం బలిహరణ రాత్రి తొమ్మిది గంటల 41 గజావాహరోహణం, రాత్రి 11 గంటల 15 నిమిషాలకు ఎదురుకోలు మహోత్సవం శివలింగొద్భవ కాలమందు రుద్రాభిషేకం రాత్రి ఒంటిగంట ఐదు నిమిషాలకు శ్రీ సదాశివ పుత్రుడు శ్రీ చంద్ర శేఖర స్వామి వారికి శ్రీ హిమవంతుని పుత్రిక శ్రీ పార్వతి దేవి అమ్మవారికి శాంతి కల్యాణ మహోత్సవ ఉత్సవ కార్యక్రమం జరుగునని తెలియజేశారు. కళ్యాణ మహోత్సవంలో స్వామివారికి మంగళసూత్రం సమర్పించువారు వైభవ్ జ్యుయలరీ మార్ట్ అధినేత తిరువూరు ఏఎంసి వైస్ చైర్మన్ కుక్కడపు వెంకట నాగేశ్వరరావు రత్నకుమారి దంపతులు, శివరాత్రి పర్వదినాన ఉదయం సాయంత్రం వేళలలో కళ్యాణ ప్రసాదం గోపాలరావు రాధా రాణి కాదా శ్రీనివాస్ వసుధ దంపతులు అందించనున్నారని 16వ తేదీ సోమవారం తత్కాల్ అమావాస్య ఉదయం నంది వాహనోత్సవం సాయంత్రం 6:15 నిమిషాలకు ప్రదోషకాల పూజ 7 గంటల 15 నిమిషాలకు విద్యుత్ దీప కాంతులతో స్వామి వాళ్ళ రథోత్సవం జరిగినది తెలియజేశారు. మూడు రోజుల కళ్యాణ కార్యక్రమాలకు సంబంధించి కళ్యాణ మహోత్సవంలో కళ్యాణ వస్త్రాలు మరియు రథోత్సవం ప్రసాదశీ సమర్పకులు హనుమత్ సీతారామ లక్ష్మణ భరత శత్రుజ్ఞ ఆయిల్స్ ఐరన్ అండ్ సిమెంట్ ట్రేడర్స్ శ్రీ గంధం సత్య శ్రీ హనుమంతరావు సాయి లక్ష్మి దంపతులు అందించనున్నారని పవళింపు సేవా కార్యక్రమానికి సంబంధించి మాజీ సర్పంచ్ ల్యాండ్ లార్డ్ కుకడం ప్రసాదరావు అలివేలుతయారు దంపతులు, దేవస్థానమునకు లైటింగ్ మరియు కళ్యాణోత్సవంలో విద్యుత్ బల్బులు అలంకరణ తదితరాలకు సంబంధించి దివంగత డాక్టర్ నల్లమోతు వీరయ్య చౌదరి ధర్మపత్ని డాక్టర్ విజయలక్ష్మి స్వామివారి రథోత్సవమునకు పూల డెకరేషన్ సమర్పకులు మహాలక్ష్మి జా గిరి అధినేత జూలూరు రాంబాబు శేషు కుమారి దంపతులు దేవస్థానం మరియు కళ్యాణ మండపమునకు రంగులు వేయించిన దాత బి శ్రీనివాసరావు జయ సూర్య బిల్డర్స్, 15 సంవత్సరాలుగా కళ్యాణ పూజా ద్రవ్యాలను సమర్పించు వారు రామ్ సాయి ఐరన్ అండ్ సిమెంట్ పెయింట్ జువ్వా అప్పారావు సుజాత దంపతులు, మంగళవారం మంగళ వాయిద్యాల సమర్పకులు మందపాటి వెంకటరెడ్డి పద్మావతి - లక్ష్మి కుమారి దంపతులు, శ్రీ గంగా పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి వారి కళ్యాణ అనంతరం మంగళవారం స్వామి వారి ఊరేగింపు ప్రసాదను గోళ్ళ వెంకట గురునాధరావు ఝాన్సీ దంపతులు భక్తిశ్రద్ధలతో అందించనున్నారు అని చెప్పారు.

# ముందస్తు ప్రణాళిక అవసరమన్న ఎంపీపీ గద్దల మల్లయ్య




**విస్సన్నపేట,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో త్రాగునీటి సరఫరా విషయంలో అధికారులు ప్రజాప్రతినిధులు ముందస్తు ప్రణాళిక వేసుకొని కార్యాచరణ నిర్వహించాలని మండల సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ గద్దల మల్లయ్య అన్నారు. ముఖ్య కూడళ్ళలో గ్రామ పంచాయతీల పరిధిలో ఎండల ముదిరే సమయంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్న రాట్నాలు, ఎమ్మార్వో కే లక్ష్మీ కళ్యాణి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, మండల వైద్యాధికారి కే శ్రీనివాసరావు, గృహ నిర్మాణ శాఖ సత్యనారాయణ, మారెమండ గ్రామ సర్పంచ్ నందమూరి శ్రీరామచంద్ర, చంద్రుపట్ల గ్రామ సర్పంచ్ భూ బత్తుల బాలకొండయ్య, చంద్రుపట్ల ఎల్టి బోడే సూర్యనాయక్ , పుట్రెల స్వాతి, తెల్లదేవరపల్లి రాయల నాగరాణి తదితర సర్పంచులతో పాటు ఎంపీటీసీ ఓలేటి దుర్గారావు, సహకార సంఘ అధ్యక్షులు తెల్లదేవరపల్లి వీరమాచినేని కృష్ణ ప్రసాద్, విస్సన్నపేట కంభంపాటి బద్రీనాథ్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కేసరపల్లిలో జల్ అర్పన్ దివాస్ ర్యాలీ




**కేసరపల్లి, ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** కేసరపల్లి గ్రామంలో, గ్రామపంచాయతీ కార్యాలయంలో,గ్రామ సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీ మౌనిక ఆధ్వర్యంలో శుక్రవారం "జల్ అర్పన్ దివాస్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కె.సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసరపల్లి గ్రామంలో 2023 లోనే ప్రతి ఇంటికి నీటి కుళాయి ఏర్పాటు చేసి అందరికీ సురక్షిత నీటిని అందించామని,అందరూ కూడా నీటి విలువను,ప్రాధాన్యతను తెలుసుకోవాలని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ మౌనిక మాట్లాడుతూ ఈ ప్రపంచంలో ప్రతి మనిషికి నీటి అవసరం ఉందని, మనిషి మనుగడకు పంచభూతాలు ఏ విధంగా దోహదపడతాయో, వాటిలో నీరు ముఖ్యపాత్ర వహిస్తుందని, కనుక మనమంతా నీటిని జాగ్రత్తగా ఉపయోగించుకుంటూ కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని వివరించారు. అనంతరం "జల సంరక్షణ - మన బాధ్యత" అనే నినాదాలతో భారీ ర్యాలీ నిర్వహించి, స్థానిక వాటర్ ట్యాంక్ కు "జల రక్షాబంధన్" కట్టి, అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టి.స్వర్ణలత, డిప్యూటీ ఎంపీడీవో టి.భారతి, గ్రామపంచాయతీ కార్యదర్శి సిహెచ్.ప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, అంగన్వాడి సిబ్బంది, ఆశా వర్కర్లు, ఆర్డబ్ల్యూఎస్ ల్యాబ్ సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రేడియో జనరంజక వాణి



**పోడూరు,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** సమాచార ప్రసార రంగ ప్రాధాన్యతను గుర్తుచేసే రోజు ప్రపంచ రేడియో దినోత్సవం అని హెచ్ యం కొల్లాబత్తుల సూర్య కుమార్ అన్నారు. పోడూరు మండలం చింతలగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రపంచ రేడియో దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు రేడియోని చూపి వివరించారు. ఈసందర్భంగా సూర్య కుమార్ మాట్లాడుతూ ప్రపంచ రేడియో దినోత్సవం ప్రతి సంవత్సరం జరుపుకునే అంతర్జాతీయ దినోత్సవం నవంబర్ 3, 2011న జరిగిన యునెస్కో 36వ సదస్సులో ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి 13న ప్రపంచ రేడియో దినోత్సవం జరుపుటకు నిర్ణయించింది. విజ్ఞాన దాయకమైన ఖచ్చితమైన సమాచారాన్ని వేగంగా ప్రజల చెంతకు చేర్చడంలోను, భావప్రకటనా స్వేచ్ఛను ప్రోత్సహించడంలోను రేడియో ప్రముఖపాత్ర పోషిస్తుందని, రేడియో వినియోగాన్ని ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఛాత్రోపాధ్యాయురాలు కే.సాయి లక్ష్మి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్నదానం కు రూ. 1,00,116ల విరాళం....



**పెనుగంచిప్రోలు,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లో జరుగు అన్నదానం కు పెనుగంచిప్రోలు గ్రామ వాస్తవ్యులు ఇంజం నాగేశ్వరరావు, రాములమ్మ కుటుంబ సభ్యులు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి నిత్య అన్నదాన పథకమునకు రూ?1,00,116/- రూపాయలు విరాళముగా ఆలయ తనిఖీదారు పి యల్ నవీన్ కుమార్ కు శుక్రవారం అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేశారు...

# బాలింతలు,తల్లులు నాణ్యమైన ఆహారం తీసుకోవాలి..

- రక్తహీనత పై తల్లులు అవగాహన కలిగి ఉండాలి.
- లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి.







**గాజువాక/విశాఖపట్నం,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని,ప్రతి,మహిళ, తల్లి,బాలింతలు తప్పకుండా నిత్యం నాణ్యమైన ఆహారం తీసుకునేందుకు శ్రద్ధ వహించాలని లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి పెర్కొన్నారు. ప్రపంచ అనీమియా అవేర్‌నెస్ డే సందర్భాన్ని పురస్కరించుకుని, లీ ఫార్మా లిమిటెడ్ మరియు లీ హెల్త్ డొమైన్ సంయుక్తంగా అగనంపూడి అంగన్‌వాడీ కేంద్రంలో రక్తహీనతపై అవగాహన సదస్సును నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ప్రధానంగా గర్భిణీలకు మరియు బాలింతలకు వారి మాతృత్వ ప్రయాణంలో తోడ్పడే సమతుల్య ఆహారం, ఐరన్ మరియు కాల్షియం అధికంగా ఉండే ఆహార పదార్థాల ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం 50 మంది గర్భిణీలు మరియు బాలింతలకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీ ఫార్మా డైరెక్టర్ అళ్ళ లీలా రాణి మాట్లాడుతూ ప్రతి తల్లి,బాలింత నాణ్యమైన ఆహారం తీసుకోవడంలో శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్లు జయలక్ష్మి, సరోజిని, న్యూట్రిషనిస్టు (పోషకాహార నిపుణులు) మాధురి, క్రాంతి కుమారి , జి.ఎన్.ఎమ్ భాగ్యలత సర్వహిత ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గజేంద్రరావు, ఐ.సి.డి.ఎస్ ఇన్‌ఛార్జ్ చెల్లయ్యమ్మ అగనంపూడి సెక్టార్ లీ టీమ్ మరియు సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక ప్రదేశాలు లీజుకు దరఖాస్తులు ఆహ్వానం



**అమలాపురం,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జిల్లా పర్యాటక మండలి సూ చించిన రెండు పర్యాటక ప్రదేశాలలో లీజు కొరకు దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నా యని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ ఆడిటోరియం, కేఫెటేరీయ, రెస్టారెంట్, వెయిటింగ్ హాల్,సాహస క్రీడలు నిర్వహణ కొరకు ఆసక్తి గల, సంబంధిత ఆతిథ్య రంగం లో కనీసం మూడు సంవత్సరాల అనుభవం కలిగిన వ్యక్తులు,సంస్థల నుండి బిడ్లు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు.వీటిలో మొదటిది మామిడి కుదురు మండలం పాశర్లపూడి గ్రామం నందు ఓపెన్ ఆడిటోరియం, కేఫెటేరీయ, రెస్టారెంట్, వెయిటింగ్ హాల్, సాహస క్రీడలు నిర్వహణ నిమిత్తం 2833 చ.మీ. కనీస బాడుగ రూ.5,00, 000లు చెల్లించనున్నట్లు తెలిపారు. రెండవది మామిడికు దురు మండలం అదుర్రు గ్రామం నందు ఓపెన్ ఆడిటోరియం, కేఫెటేరీయ రెస్టారెంట్, వెయిటింగ్ హాల్, మరియు సాహస క్రీడలు నిర్వహణ కొరకు 4047 చ.మీ.(ఒక ఎకరం) కనీస బాడుగ రూ.3,00, 000 లు నిర్ణయించినట్లు తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు రూ.5000 డిపాజిట్ను అధ్యక్షులు జిల్లా పర్యాటక కౌన్సిల్,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ పేరున డి డి రూపంలో ఇచ్చి బిడ్ ఫారంను జిల్లా పర్యాటక అధికారి, కో-ఆర్డినేట్ సెక్షన్, కలెక్టరేట్ కార్యాలయం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం నందు ఈనెల 16వతేది నుండి మార్చి 2వ తేదీ వరకు ఉదయం 11.00గం. నుండి సాయంత్రం 3.00 గం. మధ్య కార్యాలయపు పని దినాలలో పొందగలరన్నారు. ఈనెల 16వ తేది నుండి మార్చి 2 వ తేదీ వరకు కార్యాలయపు పని వేళల లో ఉదయం 11. 00గం నుండి సాయంత్రం 3.00గం. వరకు బిడ్ ఫారాలు స్వీకరించబడు నన్నారు. మార్చి రెండవ తేదీ సాయంత్రం 4.00 గంటలకు బిడ్లు ఓపెన్ చేయబడున న్నారు. బిడ్లు వేయుటకు కావలసిన అర్హతలు, నిర్వహణ నియమావళి, వార్షిక లీజు స్థిరీకరణ షెడ్యుల్ నందు పొందుపరచడం జరిగిందన్నా రు. బిడ్లు రద్దు పరచు అధికారం జిల్లా కలెక్టరుకు కలదన్నారు.ఇతర వివరములకు జిల్లా పర్యాటక అధికారి పర్యాటక శాఖ, కోనసీమ జిల్లా సంప్రదించాల్సిన చరవాణి నెంబర్ 9121725757 గా నిర్దేశించామని జిల్లా కలెక్టరు ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా ప్రపంచ రేడియో దినోత్సవం



**కాకినాడ,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** ఒకప్పటి సాంప్రదాయ రేడియో ప్రస్తుత ఆధునిక సమాచార విప్లవానికి మాతృక అని ప్రముఖ సామాజిక వేత్త వక్కలంక రామకృష్ణ అన్నారు.రేడియో అల 90.8 ఎఫ్.ఎం,మలిరెడ్డి చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ రేడియో దినోత్సవ వేడుకలు శుక్రవారం కాకినాడలోని మహర్షి బులుసు సాంబమూర్తి జిల్లా ప్రజా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో జరిగాయి.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.సాయిబాబా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధి వక్కలంక రామకృష్ణ మాట్లాడుతూ రేడియో ను ప్రజలకు చేరువ చెయ్యడంతో పాటుగా, సరైన సమగ్ర సమాచారాన్ని ప్రజలందరికీ అందించాలనే లక్ష్యంతో భారత ప్రధాని నరేంద్రమోడీ మన్‌కీబాత్ వంటి రేడియో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారంటూ రేడియో ప్రాముఖ్యతను వివరించారు. రేడియో అల 90.8 ఎఫ్.ఎం స్టేషన్ డైరెక్టర్ ఎం.సత్య మాట్లాడుతూ అతి తక్కువ ఖర్చుతో సమాచారాన్ని, వినోదాన్ని పొందే అద్భుతమైన మాధ్యమం రేడియో ఒక్కటే అన్నారు. ఈ ఏడాది ప్రపంచ రేడియో దినోత్సవ నినాదంగా "రేడియో,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్" గా యునెస్కో ప్రకటించిందని తెలిపారు.ఎ.ఐ ఒక సాధనం మాత్రమే - గొంతుక కాదు అనే ప్రధాన నినాదంతో రేడియో కేంద్రాలు కార్యక్రమాలను కృత్రిమంగా రూపొందించకుండా మానవీయ స్పర్శతో రూపకల్పన చెయ్యాలని యునెస్కో పిలుపునిచ్చిందని డైరెక్టర్ సత్య అన్నారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం పెరిగిపో తున్న నేటి కాలంలోనూ,రేడియో యొక్క విశ్వసనీయతను, మానవీయ స్పర్శను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని మరో అతిధి అల్లూరి సురేంద్ర తెలిపారు.ఈ కార్యక్రమంలో మలిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ ఎం.వి.ఆర్.ఫణీంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు రామలక్ష్మి, పద్మావతి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పులూరు వంతెన మరమత్తు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడె



**కంకిపాడు / పెనమలూరు,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** మండలంలోని ఉప్పులూరు గ్రామంలో రవెష్ కాలువపై నిర్మించిన వంతెన బ్రిటీష్ కాలం నాటిది కావడంతో, ఇటీవల వంతెన పై పెచ్చులు ఊడి గుంటలు ఏర్పడ్డాయి. గ్రామస్తులు, స్థానికులు ,ప్రయాణికులు రాకపోకలు సాగించడానికి ప్రమాదకరంగా ఉందని స్థానిక ఎమ్మెల్యే బోడె దృష్టికి తీసుకువెళ్లడంతో సంబంధిత అధికారులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించడంతో వంతిన మరమత్తు పనులు చేపట్టారు గన్నవరం, కంకిపాడు వెళ్లే భారీ వాహనాలను కోమటిగుంట మీదుగా ట్రాఫిక్ మళ్లింపు చేశారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మరమత్తు పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా బోడే మాట్లాడుతూ తత్కాలికి ఇంక మరమత్తు పనులు చేపట్టిన పరలో శాశ్వత పరిష్కారం కోసం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిధులు కేటాయించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ధనయ్య, మాజీ ఎంపీపీ దేవునేని రాజ, టిడిపి నాయకులు ప్రభాకర్ ,కోయ ఆనంద్ , రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కేసరపల్లికి కస్టమ్స్ కార్యాలయం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ చొరవ



**గన్నవరం,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** గన్నవరం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ కృషితో కేసరపల్లిలో కస్టమ్స్ కార్యాలయాల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్న కస్టమ్స్ ప్రివెంటివ్ కమిషనరేట్, సెంట్రల్ ఎక్సైజ్ మరియు సర్వీస్ టాక్స్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు వీలుగా ప్రభుత్వం 3.84 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. కేసరపల్లిలోని సర్వే నంబర్ 29/8లో ఈ భూమిని కేటాయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం బుధవారం జరిగిన సమావేశంలో ఆమోదముద్ర వేసింది. ఇక్కడ కేవలం కార్యాలయ భవన సముదాయ మే కాకుండా, అధికారులు మరియు సిబ్బంది కోసం నివాస గృహాలను కూడా నిర్మించనున్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చేలా చేయడం తో, త్వరలోనే ఈ కార్యాలయాలన్నీ కేసరపల్లిలో కొలువుదీరనున్నాయి.

# భారత గాన కోకిల సరోజినీ నాయుడు జయంతి



**హనుమాన్ జంక్షన్,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** మద్దాయి కుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు భారత గాన కోకిల గా పిలవబడిన శ్రీమతి సరోజినీ నాయుడు 148వ జయంతి వేడుకలు ప్రధానోపాధ్యాయులు దారపురెడ్డి భాస్కర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళు లు అర్పించారు. హైదరాబాదు నందు జన్మించి లండన్ లోని కేంబ్రిడ్జి యూనివర్సిటీ నందు విద్యాభ్యాసం చేసి కవిగా, రచయితగా, ఆంగ్ల భాష మీద పట్టు సాధించి ది గోల్డెన్ త్రిశాల్ట్, ది బర్డ్ ఆఫ్ టైం, ది బ్రోకెన్ వింగ్ వంటి ప్రముఖ పుస్తకాలను రచించి భారత గాన కోకిలగా పేరు తెచ్చుకున్నారని ఆమె ఆంగ్ల భాష కోసం ఎనలేని సేవ చేశారనితెలిపారు. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పాల్గొని 1925 వ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా ఎంపిక అయ్యారు. అనంతరం మహాత్మా గాంధీ అడుగుజాడల్లో క్విట్ ఇండియా పోరాటంలోపాల్గొన్న గొప్ప దేశభక్తురాలు అని, స్వాతంత్రం సాధించిన తర్వాత మొట్టమొదటి మహిళా గవర్నర్ గా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి పనిచేసే మహిళలు మరియు విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని, ప్రతి ఒక్కరూ ఆమె జీవిత చరిత్రను తెలుసుకుని బాగా చదువుకుని మంచి విద్యార్థులుగా రాణించాలని భాస్కర్ రావు సూచించారు. ఈ కార్యక్రమానికి ఆంగ్ల ఉపాధ్యాయులు బి జాన్సన్ ఆమె చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు.



చంద్రపురి కాలనీలో శ్రీ సాయి కృష్ణ బృందావనం 25వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ సాయి సన్నిధిలో అంగరంగ వైభవంగా పూజలు జరిగాయి. ఈ సందర్భంగా కృష్ణ బాబా ని వారి సతీమణి శోభ ని మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ సతీమణి రెడ్డి శెట్టి నాగరాణి వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. **జవహర్ నగర్, ఫిబ్రవరి 13:(వార్తా ప్రభ)**

## పరోక్ష ఎన్నికల దృష్ట్యా మూడుచింతలపల్లిలో 5 మందికి మించి గుంపులపై నిషేధం.

**- మల్కాజిగిరి డిసిపి శ్రీధర్.**



**ఎల్బీనగర్/వార్తప్రభ (ఫిబ్రవరి 13):**రాష్ట్ర ఎన్నికల సంఘం పరోక్ష ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమల్లో కొనసాగుతోంది. ఫిబ్రవరి 16న మున్సిపాలిటీల చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఐదుగురికి మించి ఎలాంటి గుంపులు గుమికూడకూడదని ఆదేశాలు జారీ అయ్యాయి. సిహెచ్ శ్రీధర్, డిసిపి, మల్కాజిగిరి జోన్, భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 ప్రకారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 14 ఉదయం 5 గంటల నుంచి ఫిబ్రవరి 16 సాయంత్రం 5 గంటల వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపారు. ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుని, సంబంధిత అభ్యర్థులు/పార్టీలకుతక్షణ నోటీసులు జారీ చేయనున్నట్లు హెచ్చరించారు.

## మహా శివరాత్రి వేడుకలకు వీరన్న గుట్టపై రూ.2 లక్షలతో ప్రత్యేక ఏర్పాట్లు.



**ఎల్బీనగర్/వార్తప్రభ (ఫిబ్రవరి 13):**మన్సూరాబాద్ డివిజన్, హయత్‌నగర్ పరిధిలోని ప్రాచీన వీరన్న గుట్ట ఆలయంలో మహా శివరాత్రి పండుగ సందర్భంగా భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు రూ.2 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి వినతిపై ఈ నిధులు విడుదలైనట్లు తెలిపారు. వాహనాల రాకపోకలకు రోడ్డు మరమ్మత్తులు, గుట్టపై మరియు కింద విద్యుత్ దీపాల ఏర్పాటు, అగ్నిగుండాల ప్రాంగణ శుభ్రపరిచే పనులు, భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. శివరాత్రి జాగరణ సందర్భంగా భజన కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, ఆలయ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మూసినదిలో స్వయంభూ శివలింగేశ్వరుడికి శివరాత్రి జాతర ఏర్పాట్లు ప్రారంభం.





**ఎల్బీనగర్/వార్తప్రభ (ఫిబ్రవరి 13):** మహాశివరాత్రి సందర్భంగా ఫణిగిరి కాలనీ సభ్యుల అభ్యర్థన మేరకు మూసి నదిలో ఉన్న స్వయంభూ శివలింగేశ్వర స్వామివారి జాతర పనులు ప్రారంభమయ్యాయి. చైతన్యపురి మాజీ కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్తా గత నెల 20న జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు ప్రపోజల్ పంపగా, ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ బృందం మూసీలో పనులు చేపట్టింది. ఈ సందర్భంగా రంగా నర్సింహా గుప్తా పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకన్న, రాకేష్, అంజి, జగన్, నాగేందర్, వలి, ఉపేందర్ తదితరులు మరియు జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

# అసాధారణ ప్రతిభావంతురాలు "భారత కోకిల" సరోజని నాయుడు





**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ):**కొండాపూర్ డివిజన్ పరిధిలోని శారదా హైస్కూల్‌లో భారతకోకిల సరోజినీ నాయుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి స్కూల్ కరెస్పాండెంట్ బందా నరేంద్ర బాబు అధ్యక్షత వహించారు. సరోజినీ నాయుడు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యిణి దేవారెడ్డి విజయలక్ష్మి హాజరై మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ 1879 ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లో జన్మించిన సరోజినీ నాయుడు చిన్న వయస్సులోనే అసాధారణ ప్రతిభ కనబరిచారని తెలిపారు. మెట్రిక్యులేషన్‌లో ప్రతిభాపాటవాలు చూపిన ఆమెకు నిజాం నవాబు స్కాలర్‌షిప్ మంజూరు చేసి విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం చేసే అవకాశం కల్పించారని వివరించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొని మహాత్మా గాంధీకి సన్నిహితురాలిగా మారిన ఆమె, 1925లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి తొలి భారతీయ మహిళా అధ్యక్షురాలిగా చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా నియమితులై తొలి మహిళా గవర్నర్‌గా గుర్తింపు పొందారని తెలిపారు. మహిళా విద్య, హక్కులు, రాజకీయ సాధికారతకు కృషి చేసిన మహోన్నత నాయకురాలని కొనియాడుతూ, ఆమె జన్మదినాన్ని 'జాతీయ మహిళా దినోత్సవం'గా జరుపుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శేషుబాబు, విద్యార్థులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివరామకృష్ణ, అమ్మయ్య చౌదరి, వాణి సాంబశివరావు, శివరామిరెడ్డి, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గెలుపుతోనే అయిపోలే!!

**● అసలు పని ముందుంది ● నమ్మి ఓట్లేసిన ప్రజలకు ధన్యవాదాలు ● ప్రజా బాటలో నడుస్తాం సమస్యలన్నీ పరిష్కరిస్తా ● 29వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ నిమ్మరాజుల రజిని రవి**




**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 13 (వార్తాప్రభ ప్రతినిధి)**నేడు వెలువడిన రామగుండం మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో 29వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ అభ్యర్థి నిమ్మరాజుల రజిని రవి భారీ మెజారిటీతో ఘన విజయం సాధించి రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ......తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన డివిజన్ ప్రజలందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేశారు. కేవలం గెలుపుతోనే బాధ్యత తీరిపోలేదని, అసలైన ప్రజా సేవ ఇప్పుడే మొదలైందని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ, డివిజన్‌లో పేరుకుపోయిన సమస్యలన్నింటినీ సత్వరమే పరిష్కరిస్తానని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఎల్లప్పుడూ ప్రజా బాటలోనే నడుస్తూ, వార్డును అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలబెట్టడమే తన ప్రథమ లక్ష్యమని రజిని రవి ఉద్ఘాటించారు. భారీ మెజారిటీతో గెలిపించిన కార్యకర్తలు, ప్రజల అభిమానాన్ని ఎన్నటికీ మరువనని, ప్రతి నిమిషం అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని పేర్కొన్నారు. విజయానికి ప్రధాన కారకులైన కౌశిక హరి లతలకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# 41లో ప్రకాశించిన "సూర్య"!!

**● నాడు నాన్న.....నేడు కొడుకు ● నాన్న చరిష్మా... స్థానికత... గెలుపు ● నమ్ముకున్న ప్రజల సహకారంతో గెలుపు ● బంగికి భంగపాటు...నిరాశ ● 1034 ఓట్లతో ప్రభంజనం సృష్టించిన సీపీఐ**



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 13 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం నగరపాలక సంస్థ ఎన్నికల ఫలితాల్లో 41వ డివిజన్ రాజకీయ ముఖచిత్రాన్ని తిరగరాస్తూ ఎర్రజెండా రెపరెపలాడింది. సీపీఐ అభ్యర్థి "సూర్య" తన తండ్రికున్న అపారమైన రాజకీయ చరిష్మాను, స్థానికతను ఆయుధంగా మలచుకుని ప్రత్యర్థులకు అందనంత ఎత్తులో నిలిచారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో ఉన్న మమేకం, నిరంతరం వారి సమస్యలపై పోరాడే తత్వం ఈ గెలుపుకు బలమైన పునాది వేసింది. ముఖ్యంగా గెలుపు ధీమాతో ఉన్న ప్రత్యర్థికి "భంగికి భంగపాటు" అన్నట్లుగా ఓటర్లు షాక్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రత్యర్థికి ఓట్లు పడ్డాయి కానీ, అవి గెలుపు తీరానికి చేర్చలేకపోయాయి. ప్రజలు సూర్య వైపే మొగ్గు చూపుతూ ఓటు ద్వారా తమ తీర్పును స్పష్టంగా వినిపించారు. ఏకంగా 1034 ఓట్లు సాధించి 119 ఓట్ల మెజారిటీతో సీపీఐ అభ్యర్థి సృష్టించిన ఈ ప్రభంజనం రామగుండం నగర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. నమ్ముకున్న ప్రజలు అండగా నిలవడంతో, సీపీఐ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. అభివృద్ధికి మారుపేరుగా, పేదల గొంతుకగా సూర్య ఈ డివిజన్‌ను ముందుకు తీసుకెళ్తారని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు పచ్చ నోట్లకు కక్కుర్తి పడి ఓడగొట్టే వారు ఓట్లు వేయకపోయినా, గెలిపించే ప్రజలు నీరాజనం పలకడంతో 41వ వార్డులో ఎర్ర సూర్యుడు ప్రకాశించి సరికొత్త చరిత్రను లిఖించాడు.

## జీవితంలో మరువలేని అనుభూతి

**సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు**









**విజయవాడ, ఫిబ్రవరి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి):**దాదాపు 35 ఏళ్ల తర్వాత గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో తొలి వరుసలో కూర్చున్న ఆ సీటు తనకు ఎప్పటికీ మరువలేనిదిగా మిగిలిపోతుందని సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు తెలిపారు. అప్పట్లో దాసరి కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు కే. విశ్వనాథ్, సినీనటుడు చంద్రమోహన్ పక్కన కూర్చోవడం జరిగింది. తాజాగా చిరకాల మిత్రులు, కళాకారులు, జర్నలిస్ట్ ముత్తవరపు సురేష్ బాబు ఆధ్వర్యంలో అంతర్జాతీయ నాటకోత్సవాలు 5 రోజులపాటు వైభవంగా జరిగాయి. ఇప్పుడు, మళ్లీ అదే వేదికపై, ముగింపు సభలో తొలి వరుసలోనే తన చిరకాల మిత్రులు రాజశేఖర్, డి. సూర్యప్రకాశ్ (ఎస్పీ), జర్నలిస్టులు రామారావు, ప్రసాద్ తదితరులతో కలిసి పాల్గొనడం తనకు అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కాలం మారినా, ఆ సీటు ఇచ్చిన స్ఫూర్తి మాత్రం మారలేదని ఆయన అన్నారు.

## శివరాత్రి తిరునాళ్లు సౌకర్యాలు పరిశీలించిన డీసీపీ లక్ష్మీనారాయణ



**విస్సన్నపేట ఫిబ్రవరి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక మండలంలో కొండ పర్వ గ్రామపంచాయతీ పరిధిలో 17వ శతాబ్దంలో వెలసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి శివరాత్రి తిరునాళ్లు కార్యక్రమ సౌకర్యాలను డిసిపి లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు. తొలుత స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డ్రోన్ కెమెరా విజువల్స్ తోపాటు సీసీ కెమెరాల ఏర్పాటు పరిశీలించారు. ఎస్ ఐ అర్జునరాజు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాయల సుబ్బారావు, మహేష్ సత్యనారాయణ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్, సీపీఐ నాయకుల సంబరాలు

**మంచిర్యాల : ఫిబ్రవరి 13:(వార్తా ప్రభ ప్రతినిధి)** జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీలో అత్యధిక స్థానాలు సాధించిన బీఆర్ఎస్, మిత్రపక్షమైన సీపీఐ నాయకులు కలసి శుక్రవారం గెలుపు సంబరాలు నిర్వహించారు. ఎన్నికల్లో మొత్తం 22 స్థానాలకు గాను బీఆర్ఎస్ 12, మిత్ర పక్షం సీపీఐ 3, కాంగ్రెస్ 5 వార్డుల్లో గెలుపొందింది. దీంతో బీఆర్ఎస్ మాజీ పార్లమెంట్ సభ్యుడు బాల్కసుమన్, సీపీఐ నాయకులు సంతోషం వ్యక్తం చేస్తూ పట్టణంలో సంబరాలు జరిపారు. మున్సిపాలిటీ ప్రజలు ఆశీర్వదించి గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

వార్తా ప్రభ
హైదరాబాద్

## వైభవంగా ప్రారంభమైన "చేనేత హస్తకళ ఉత్పత్తుల మేళా"



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ):**మాదాపూర్ శిల్పారామంలో బెల్లం మాధవి ఆధ్వర్యంలో మహిళా పారిశ్రామిక వేత్తల చేనేత–హస్తకళ ఉత్పత్తుల మేళా ప్రారంభమైంది. తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్, సావిత్రి భాయ్ విమెన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ మేళా వారం రోజులు కొనసాగుతుంది. కాటన్, చందేరీ, కోట చీరలు, జ్యూట్ బ్యాగ్స్, సిరి ధాన్యాలు, హస్తకళ ఉత్పత్తులతో స్టాల్స్ ఆకట్టుకుంటున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అమృత శిష్యబృందం కూచిపూడి నృత్యాలతో ప్రేక్షకులను మెప్పించింది.

## రాఘవేంద్ర కాలనీ అభివృద్ధికి కృషి చేసిన నాయకుడికి ఘన సత్కారం.



**ఎల్బీనగర్/వార్తప్రభ (ఫిబ్రవరి 13):**రఘవేంద్ర కాలనీవాసులు మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ని ఘనంగా సన్మానించి కృతజ్ఞతాభివందనం తెలిపారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలో గత ఐదేళ్లలో కాలనీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తుచేస్తూ కాలనీ పెద్దలు, మహిళలు, యువత శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజ్, వీధి దీపాలు, తాగునీటి సదుపాయాల మెరుగుదల వంటి పలు అభివృద్ధి పనులతో కాలనీ రూపురేఖలు మారాయని వాసులు పేర్కొన్నారు. ప్రజల ప్రేమాభిమానాలే తన బలమని, భవిష్యత్తులో కూడా అభివృద్ధి కోసం కృషి చేస్తానని నవజీవన్ రెడ్డి హామీ ఇచ్చారు.

## శివాజీ మహారాజ్ విగ్రహంపై వివాదం

**అనుమతులతోనే ఏర్పాటు చేస్తాం. - మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి.**






**ఎల్బీనగర్/ వార్త ప్రభ (ఫిబ్రవరి 13):**మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ప్రాంతంలోని పలు కాలనీ సంక్షేమ సంఘాలు కలిసి చౌరస్తాలో చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. స్వచ్ఛందంగా చందాలు సేకరించి కాంక్రీట్ పిల్లర్ నిర్మించగా, అనుమతి లేకుండా నిర్మాణం జరిగిందన్న కారణంతో జీహెచ్ఎంసీ సిబ్బంది, పోలీసులు దానిని తొలగించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ.., ప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ చట్టబద్ధంగా అన్ని అనుమతులు తీసుకుని శివాజీ మహారాజ్ విగ్రహాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. కాలనీ సభ్యులు, బీజేపీ నాయకులు పోలీస్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేసి చట్టపరమైన మార్గంలో ముందుకు సాగుతామని తెలిపారు

## శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



**ఎల్బీనగర్/ వార్తప్రభ (ఫిబ్రవరి 13):** కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన కళ్యాణం మరియు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బాలాస్యం , సురభి వెంకటేశ్వరావు ,హరీష్ రెడ్డి, సురేందర్ రెడ్డి తదితరులు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రాంతీయ ప్రజల సుఖశాంతి కోసం ప్రార్థనలు చేశారు.

# ఎడిటోరియల్

## టీడీపీకి మరో కేంద్ర మంత్రి పదవి ?

తెలుగుదేశం పార్టీ ఎంపీల మద్దతు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఎంత కీలకమో తెలిసిందే. 2024 ఎన్నికల్లో ఎన్డీయే మూడవసారి వరసగా అధికారం చేపట్టడానికి కారణం తెలుగుదేశం అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తెలుగుదేశానికి 16 ఎంపీలు ఏపీ నుంచి ఉన్నారు. అలాగే ఆ పార్టీ మద్దతుతో కూటమిలో ఉన్న బీజేపీ మూడు, జనసేన రెండు ఎంపీ సీట్లు సాధించాయి. ఈ బలం అంతా బీజేపీకి ఎంతగానో అక్కరకు వచ్చింది. రెండు పదవులతో : ఇదిలా ఉంటే 2024 జూన్ 9న నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానిగా కేంద్రంలో బాధ్యతలు స్వీకరించినపుడు ఏపీ నుంచి టీడీపీకి ఒక కేబినెట్, ఒక సహాయ మంత్రి పదవులు ఇచ్చారు. అదే విధంగా నామినేటెడ్ పదవులు కొన్ని దక్కాయి. కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవి దక్కింది. అయితే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు పూర్తి అయిన తరువాత కేంద్ర మంత్రి వర్గాన్ని విస్తరిస్తారు అని ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉంటే కేంద్ర మంత్రి అమిత్ షాతో తాజాగా ఏపీ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాజకీయంగా కూడా చర్చలు జరిగినట్లుగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గం విస్తరణలో ఏపీకి ఒక బెర్త్ ఇస్తారు అన్నది కూడా ప్రచారంలో ఉంది. ఆ పదవిని ఇవ్వడం ద్వారా ఎన్డీయేలో బీజేపీ తరువాత రెండో పెద్ద పార్టీ అయిన టీడీపీకి సముచితమైన న్యాయం చేసినట్లు అవుతుందని కేంద్ర పెద్దలు భావిస్తున్నారు అని అంటున్నారు. ఇక చూస్తే టీడీపీకి ఇచ్చే కేంద్ర మంత్రి పదవిని ఈసారి ప్రాంతాల వారీగా సామాజిక కోణంలో బేరీజు వేస్తూ నిర్ణయం తీసుకుంటారని అంటున్నారు. అలా చూస్తే కనుక రాయలసీమకి చాన్స్ దక్కవచ్చు అని అంటున్నారు. బలమైన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికి ఈ పదవి ఇస్తారని అంటున్నారు దాంతో నంద్యాల ఎంపీగా ఉన్న బైరెడ్డి శబరికి మహిళా కోటాలో ఈ పదవి దక్కే సూచనలు ఉన్నాయని అంటున్నారు. ఏపీ నుంచి మహిళా కేంద్ర మంత్రి అయితే లేరు. గతంలో యూపీఏ హయాంలో పురంధేశ్వరి కేంద్ర మంత్రి అయ్యారు. అలాగే శ్రీకాకుళం జిల్లాకు చెందిన కిల్లి కృపారాణి కూడా కేంద్ర మంత్రిగా పనిచేశారు.: ఉమ్మడి ఏపీలో చూస్తే టీడీపీ కేంద్రంలో పొత్తులు నెరపినపుడు రేణుకా చౌదరికి మహిళా కోటాలో చాన్స్ దక్కింది. ఈ క్రమంలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని చూస్తున్నారు. దాంతో శబరికి ఆ అవకాశం ఇస్తారని అంటున్నారు. విద్యాధికురాలుగా డాక్టర్ గా ఉంటూ పార్లమెంట్ లో ఎంపీగా గడచిన ఇరవై నెలలలో తనదైన శైలిలో ఆమె రాణిస్తున్నారు అని అంటున్నారు. బైరెడ్డి కుటుంబానికి కర్నూలు జిల్లాలో పట్టుంది. దాంతో వైసీపీకి చెక్ పెట్టేలా ఈ డెసిషన్ ఉంటుందని అంటున్నారు. చూడాలి మరి ఈ ప్రచారంలో నిజమెంత ఉందో.

## స్వర్ణరథంపై శ్రీనివాసుని చిద్విలాసం



**చంద్రగిరి :ఫిబ్రవరి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన శుక్రవారం సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు స్వర్ణరథోత్సవం కన్నులపండుగగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారు ధగధగ మెరుస్తున్న స్వర్ణరథాన్ని అధిరోహించి భక్తులను అనుగ్రహించారు. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి శ్రీభూదేవులు ఇరువైపుల ఉంటారు. శ్రీదేవి(లక్ష్మి) బంగారు. స్వర్ణరథం శ్రీనివాసునికి అత్యంత ప్రీతిపాత్రమైనది. ఈ స్వర్ణరథోత్సవాన్ని దర్శించడంవల్ల– లక్ష్మీదేవి కరుణతో సంపదలు, భోగభాగ్యాలూ; భూదేవి కరుణతో, సమస్తధాన్యాలూ, శ్రీవారికరుణతో సర్వశుభాలూ, సుఖాలూ చేకూరుతాయని విశ్వాసం . ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ రాజ్ కుమార్ , కంకణభట్టర్ బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ముని కుమార్, ధన శేఖర్, ఆలయ అర్చకులు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## చెడు వ్యసనాలు!!




నూరేళ్ళ జీవితాల్ని
కబళించు చెడు వ్యసనాలు
కూల్చునోయ్! కుటుంబాల్ని
చేయునోయ్! పలు ముక్కలు
కడు జాగ్రత్త! వాటితో
ఉండాలోయ్! నేర్పుతో
కొనసాగాలి ఓర్పుతో
ఇక కొంగ్రొత్త మార్పుతో
చెడు వ్యసనాలు యమపాశము
తీస్తాయోయ్! ప్రాణాలు
బాధనొందు కుటుంబాలు
చెల్లాచెదరగు పిల్లలు
మానాలి చెడు వ్యసనాలు
దిద్దుకోవాలి బ్రతుకులు
విజయమొంద వాటిపై
దృఢమవ్వాలి మనసులు

**-గద్వాల సోమన్న**
గణితోపాధ్యాయుడు,
ఎమ్మిగనూరు,సెల్:9966414580

# లయన్స్ క్లబ్ ద్వారా పేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు ప్రశంసనీయం

### ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆకుల శ్రీనివాస్ కుమార్






**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 13: (వార్తా ప్రభ ప్రతినిధి)**దాతలు అందించిన సహాయ సహకారాలతో ఈస్ట్ లయన్స్ ఐ హాస్పిటల్ ద్వారా పేద మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించడం అభినందనీయమని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆకుల శ్రీనివాస్ కుమార్ ప్రశంసించారు. శుక్రవారం మారుతి నగర్ లోని ఈస్ట్ లయన్స్ ఐ హాస్పిటల్ ట్రస్ట్ భవనంలో కంటి శుక్లాల ఆపరేషన్ చేయించుకున్న 17 మందికి ఆకుల శ్రీనివాస్ కుమార్ పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ గత 21 ఏళ్ల నుండి ఉమ్మడి కృష్ణా జిల్లాలో 25 వేల మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు పూర్తి చేయడం జరిగిందని , ఆ 25 వేల మంది ఆరోగ్యంతో సంతోషంగా ఉన్నారని లయన్స్ క్లబ్బుల సేవలను ఆయన కొనియాడారు. సమాజంలో పేదవారికి సేవ చేయటంలో లయన్స్ క్లబ్ సేవలు మరువలేమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ తరఫున శ్రీనివాస్ కుమార్ ను శాలువాతో సత్కరించారు. అనంతరం లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్టిక్ గవర్నర్ దాములూరి గోపీనాథ్, లయన్స్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ అన్నే రామకృష్ణ కిషోర్ మాట్లాడుతూ సేవా తత్పరత గల శ్రీనివాస్ కుమార్ రాజకీయంగా ముందంజ వేయాలని ఆకాంక్షించారు. ఆకుల శ్రీనివాస్ కుమార్ కుటుంబం మొదటి నుండి సేవా మార్గంలోనే పయనిస్తోందని, అదే బాటలో శ్రీనివాస్ కుమార్ సామాజిక సేవలో ముందుంటారని కొనియాడారు. లయన్స్ క్లబ్ ట్రస్టు ద్వారా ఎందరో దాతలు ఇచ్చిన సొమ్ముతో కంటి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు .ఈ కార్యక్రమంలో హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ బి. హనుమయ్య, క్లబ్ ప్రెసిడెంట్ పి. శివరాజ్ తదితరులు పాల్గొన్నారు

# నిమ్రాలో అంతర్జాతీయ ఓరల్ అండ్ మ్యాక్సిలోఫేషియల్ సర్జరీ దినోత్సవం

**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 13(వార్తా ప్రభ ప్రతినిధి):** స్థానిక నిమ్రా దంత వైద్య కళాశాలలో అంతర్జాతీయ ఓరల్ అండ్ మ్యాక్సిలోఫేషియల్ సర్జరీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓరల్ అండ్ మ్యాక్సిలోఫేషియల్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, సృజనాత్మక పోటీలు మరియు శాస్త్రీయ చర్చలు నిర్వహించారు.నోరు, ముఖం, దవడలకు సంబంధించిన శస్త్రచికిత్సల ప్రాధాన్యత, ప్రమాదాల అనంతరం ముఖ పునర్నిర్మాణం, ఆధునిక చికిత్సా విధానాలపై నిపుణులు వివరించారు.విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ఫేస్ పెయింటింగ్, సోప్ కార్వింగ్ పోటీలు నిర్వహించారు. ఫేస్ పెయింటింగ్ ద్వారా ముఖ నిర్మాణం, శస్త్రచికిత్స అంశాలను కళాత్మకంగా ప్రతిబింబించగా, సోప్ కార్వింగ్ పోటీలో విద్యార్థులు శస్త్రచికిత్సలో అవసరమైన కచ్చితత్వం, నైపుణ్యాన్ని చాటారు. అంతేకాకుండా ఈ ప్రత్యేక దినోత్సవాన్ని గుర్తుగా కేక్ కట్టింగ్ కార్యక్రమం నిర్వహించారు.పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు మరియు ప్రశంసాపత్రాలు అందజేశారు.



ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహనతో పాటు సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యమని ఓరల్ అండ్ మ్యాక్సిలోఫేషియల్ సర్జరీ విభాగ సహాయ ఆచార్యులు డా రాకేష్ తెలిపారు.ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డా ఎస్ సాహిత్యా రెడ్డి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి..

### ఎంపీ పుట్టా మహేష్ కుమార్

**ఏలూరు/ఢిల్లీ, ఫిబ్రవరి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** దేశవ్యాప్తంగా వినియోగదారులకు సురక్షితమైన ఆహార ఉత్పత్తుల లభ్యతను నిర్ధారించడానికి ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా పూర్తిగా కట్టుబడి ఉందన్నారు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి ప్రతాప్రవో జాదవ్. దేశంలో అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తుల తయారీ, అమ్మకం మరియు వినియోగాన్ని అరికట్టడానికి తీసుకుంటున్న చర్యల వివరాలు కోరుతూ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు లోక్ సభలో కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం, 2006 అమలు కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉమ్మడి బాధ్యతగా పేర్కొన్న మంత్రి జాదవ్, ఈ సమస్యను పరిష్కరించడానికి 'ఆజ్ సే థోడా కమ్' అనే అవగాహన చర్యను చేపట్టినట్లు వెల్లడించారు. దేశం అంతటా ఆహార భద్రత స్పృహ మరియు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడానికి సోషల్ మీడియాలో 'ఈట్ రైట్ ఇండియా' ఉద్యమం కింద FSSAI "హర్ లేబుల్ కుచ్ కెహ్తా హై" అనే అవగాహన ప్రచారాన్ని కూడా



చేపట్టిందన్నారు. ఈ అవగాహన ప్రచారం ఆహార లేబుళ్లపై వారి అవగాహనను పెంచడం ద్వారా సమాచారంతో కూడిన ఆహార ఎంపికలు చేసుకునేలా వినియోగదారులను శక్తివంతం చేయడంపై దృష్టి పెడుతుంది. ఆహార లేబుళ్లలో ఉత్పత్తి యొక్క పోషక విలువలు, పదార్థాలు వాటితో సంభవించే అలెర్జీ కారకాల గురించి కూడా లేబుళ్లలో కీలకమైన సమాచారం ఉంటుంది. ఆహార భద్రత మరియు ప్రమాణాలలో భాగంగా "పాఠశాలలో పిల్లలకు సురక్షితమైన ఆహారం మరియు సమతుల్య ఆహారాల నిబంధనలు– 2020" ను తీసుకొచ్చినట్లు కేంద్ర ఆహార మంత్రి ప్రతాప్రవో జాదవ్ తెలిపారు.అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తుల పోషక మరియు ఆరోగ్య ప్రభావాల గురించి వినియోగదారులకు తెలియచేయటంతోపాటు, నిరంతర తనిఖీలు చేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి.. ఖీూా చట్టం, 2006 కింద నిర్దేశించిన నాణ్యత మరియు భద్రతా ప్రమాణాలు ఉన్నాయా లేదో తనిఖీ చేయడానికి సంబంధిత రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ఆహార భద్రతా విభాగాల అధికారులు ఏడాది పొడవునా వివిధ ఆహార ఉత్పత్తులపై క్రమం తప్పకుండా నిఘా, పర్యవేక్షణ, తనిఖీ నమూనాల సేకరణ నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

# ఎన్నికల మేనిఫెస్టో హామీలు అమలు చేయాలి: ఎస్.టి.యు. ధర్నా



**మచిలీపట్నం ఫిబ్రవరి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఎన్నికల మేనిఫెస్టో లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలనే ప్రధానమైన డిమాండ్ తో ఎస్.టి.యు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మచిలీపట్నం ధర్నా చౌక్ లో కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి డి చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి మేనిఫెస్టో ఉద్యోగులకు ఇచ్చిన ఆరు హామీల్లో ఏ ఒక్కటి పూర్తి గా అమలు చేయలేదని, ప్రధానంగా 12వ పి.ఆర్.సి. నియామకం, 30% మధ్యంతర భృతి మంజూరు, సి.పి.ఎస్. విధానాన్ని రద్దు చేయాలని, ఆర్థిక బకాయిల చెల్లింపు కోసం రోడ్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు పి. ఇమ్మానుయేల్ ప్రసంగిస్తూ ఆర్థిక సమస్యల పరిష్కారం కొరకు ఎస్.టి.యు. దశల వారీ ఉద్యమం లో భాగంగా ధర్నా జరుగుతుందని, ప్రభుత్వం స్పందించక పోతే ఈ నెల 25 న "చలో విజయవాడ" చేపట్టనున్నట్టు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి యు వి కృష్ణమూర్తి మాట్లాడుతూ రిటైర్ అయిన వారికి చెల్లింపులు సం.ల తరబడి పెండింగ్ లోనే ఉంటున్నాయని, రాష్ట్ర ముఖ్య మంత్రి తక్షణమే జోక్యం చేసుకొని ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి విద్యాసాగర్ మాట్లాడుతూ డి.ఎస్.సి. 2003 టీచర్లకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.వి.ఎస్.ఎన్. ప్రసాద్, కొమ్ము ప్రసాద్, ముతహర్ అలీ, కృష్ణ మోహన్, సతీష్, శ్రీనివాస్ మూర్తి, జిల్లా అధ్యక్షులు పి. ఇమ్మానియేల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యు. వి. కృష్ణ మూర్తి,రాష్ట్ర అదనపు కార్యదర్శి డి చంద్రశేఖర్ ,రాష్ట్ర కార్యదర్శి డి. విద్యాసాగర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి కె. మాధవ రావు ,రాష్ట్ర కౌన్సిలర్ కొమ్ము ప్రసాద్ ,ఎం వి ఎస్ ఎన్ ప్రసాద్ కే సతీష్ బాబు అర్బన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్. కిరణ్ బాబు యం. వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల ప్రీమియర్ లీగ్ ఘనంగా ప్రారంభం

### ముఖ్య అతిథిగా హాజరైన టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి



**తిరుపతి :ఫిబ్రవరి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మూడు తరాల తిరుమలను కలిపేందుకు అందరూ కలుద్దాం–తీపి జ్ఞాపకాలను పంచుకుంటాం అనే సంకల్పంతో తిరుమల కు సంబంధించిన స్థానికులు అందరూ ఏకమయ్యారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి గురువారం మూడు తరాలకు చెందిన స్థానికులు తిరుపతిలోని తుమ్మలగుంట మైదానానికి విచ్చేసి పండుగ వాతావరణంలో టోర్నీని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రారంభించారు. దాదాపు 14 టీమ్ లు టి పి ఎల్ క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొన్నారు. ఈ ముఖ్యఅతిథిగా విచ్చేసిన అదనపు ఈవో తిరుమలలో ఎప్పుడు భక్తులతో మమేకమయ్యే స్థానికులు ఆటవిడుపుగా ఈ కార్యక్రమం నిర్వహించడం శుభ పరిమాణం అన్నారు ఈ నిర్వహణ చేపడుతున్న ఆర్గనైజర్స్ కు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు స్థానికులతో పాటు కొంత సమయం ఆయన కూడా క్రికెట్ ఆడుతూ అందరిని ఉత్సాహపరిచారు మూడు రోజులకు నిర్వహించే ఈ కార్యక్రమం లో స్థానికులు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, శ్రీధర్ వర్మ, రాజు యాదవ్, ఆర్ వి గిరి, బద్దల సురేష్, త్యాగరాజులు, కే.ఎం.చంద్ర, కొయ్యల శ్రీనివాస్, ఎం.వేలాయుధం, ఆవుల బాలసుబ్రమణ్యం, ఇతర తిరుమల స్థానికులు పెద్ద ఎత్తున కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

# శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకున్న గుంటూరు డిసిపి



**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 13( వార్త ప్రభ)** పెనుగంచిప్రోలు గ్రామంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన గుంటూరు డిసిపి సరిత.ఈమెకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు,అనంతరం వేద పండితుల ఆశీర్వచనం తీర్థప్రసాదాలు మరియు అమ్మ వారి చిత్రపటాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట సిఐ వెంకటేశ్వరరావు, పెనుగంచిప్రోలు ఎస్ఐ అర్జున్, దేవస్థాన ఏఈఓ జంగం శ్రీనివాసరావు, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ తిరుపతమ్మ అమ్మ వారిని దర్శించు కున్న ఎమ్మెల్యే, టిడిపి నాయకులు



**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 13( వార్త ప్రభ )** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ని సత్యవేడు శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం, , విజయవాడ సెంట్రల్ మీడియా కో ఆర్డినేటర్ నాగేశ్వర రావు, విజయ కృష్ణ సూపర్ బజార్ చైర్మన్ వేగళ్ల సురేష్, శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి శుక్రవారం విచ్చేసి ఆలయం లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆలయ అధికారులుతో పాటు స్థానిక టీడీపీ నేత చుంచు రమేష్ బాబు వారికి స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అమ్మ వారి చిత్ర పటాని అందజేశారు .

# కో- ఆప్షన్ సభ్యులు మహబూబ్ కు ముస్లిం పెద్దల అభినందనలు



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 13(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి మున్సిపల్ కో– ఆప్షన్ సభ్యులు షేక్ మహబూబ్ సుభాని శుక్రవారం నాడు పశ్చిమ ఇబ్రహీంపట్నం మస్జిద్ కమిటీ సభ్యులు మరియు ముస్లిం పెద్దలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మస్జిద్ కమిటీ ప్రెసిడెంట్ షేక్ ముస్తఫా శాలువాతో సత్కరించారు. అనంతరం ముస్లిం పెద్దలు మహబూబ్ సుభాని ను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేయాలని, రంజాన్ మాసం లో మస్జిద్ ల వద్ద పారిశుధ్య కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. తప్పకుండా ముస్లింల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు మహబూబ్ సుభాని. ఈ కార్యక్రమంలో మస్జిద్ కమిటీ సభ్యులు, స్థానిక ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

### శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి గ్రామీణ బ్యాంక్ వారు కటింగ్ మిషన్ బహుకరణ



**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 13( వార్త ప్రభ )** ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండల పరిధిలోని మక్కపేట ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు వారు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి కౌంటింగ్ మిషన్ అందజేసియున్నారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేయుట జరిగినది....

# 156మందికి ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వారి ఉచిత వైద్యం....



**గుడ్లవల్లేరు:ఫిబ్రవరి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మండల కేంద్రంలోని నూతనంగా ఏర్పాటు చేసిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వారు మండలంలోని చంద్రాలలోని రామాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 156మందికి సేవలు అందించారు. ఈ కార్యక్రమాన్ని ఆ గ్రామ సర్పంచి కాలిశెట్టి అర్జునరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఏపీ సీఈసీ కో–-ఆర్డినేటర్ వై.వెంకట్ ఆధ్వర్యంలో నేత్ర సమస్యలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్లు హనుమకొండ దుర్గాభవాని, శ్రీవిద్య, చందు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి నేత్ర శస్త్ర చికిత్సల కొరకు సిఫారసు చేశారు.

# ట్రాఫిక్ రూల్స్ పాటించడం అందరి బాధ్యత

**రాజకీయ నాయకులు, విద్యార్థులతో కలిసి పోలీసుల అవగాహన ర్యాలీ**

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 213(వార్తా ప్రభ ప్రతినిధి):**ట్రాఫిక్ రూల్స్ పాటించడం ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని, రూల్స్ పాటించినప్పుడు ప్రమాదాలు తగ్గుతాయని ముక్తకంఠంతో నినాదించారు. శుక్రవారం నాడు ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, పాఠశాల విద్యార్థులతో కలిసి పోలీసులు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, ట్రాఫిక్ డీసీపీ షరీనా బేగం, ఆదేశాలతో ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ పర్యవేక్షణలో రోడ్డు ప్రమాదాల నివారణ మరియు ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పచ్చిగోళ్ళ ఆనంద కీర్తి ఆధ్వర్యంలో స్థానిక మహిళలు మరియు ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా ట్రాఫిక్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఎంపీడీవో కార్యాలయం నుండి రింగ్ సెంటర్ వరకు వెళ్లి, అక్కడి నుండి పోలీస్ స్టేషన్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో స్థానిక మహిళలు, విద్యార్థినులు మరియు విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని



ప్లకార్డులు ప్రదర్శిస్తూ హెల్మెట్ వినియోగం, సీటు బెల్ట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయరాదని నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ కేవలం హెల్మెట్ వాడకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని ట్రాఫిక్ విజ్ఞప్తి చేశారు. సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ వేగానికి ప్రాధాన్యత ఇచ్చి భద్రతను విస్మరించడం వల్ల ప్రజలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోందని అన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా నిండు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు తరచూ జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఆర్ఐ కృష్ణ, కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, ఎంపిపి పాలడుగు జ్యోత్స్న, బిజెపి నాయకులు నూతలపాటి బాల కోటేశ్వరావు, బిజెపి పట్టణ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి, ఎమ్మార్వో వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శకుంతల, ఎంఈఓ పుష్పలత, ట్రాఫిక్ ఆర్ ఎస్ ఐ బి లక్ష్మణరావు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బుల్లా రాజు, మాధురి, భవాని, కల్పన, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

**బిజెపి మున్సిపాలిటీ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి**



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 13(వార్తా ప్రభ ప్రతినిధి):**మహిళలు పోటీ ప్రపంచంలో ధీటుగా నిలబడి అన్ని రంగాలలో ముందుండాలని తెలిపారు బిజెపి కొండపల్లి మున్సిపాలిటీ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి సుధీష్ణ. భారత కోకిల సరోజినీ నాయుడు జన్మదినోత్సవ సందర్భంగా నిర్వహించే జాతీయ మహిళా దినోత్సవం ను బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగవతుల హేమలత ను శాలువాతో సత్కరించారు. మహిళలందరికీ హేమలత ఆదర్శవంతురాలని వారిని గౌరవించుకోవడం కర్తవ్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దాము భవాని, ఇబ్రహీంపట్నం రూరల్ ఎస్సీ మోర్చా కల్పన తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రి స్నానాలకు పూర్తి భద్రత ఏర్పాటు

***పవిత్ర సంగమం వద్ద ఏర్పాట్లు పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ అధికారులు***



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 13(వార్తా ప్రభ ప్రతినిధి):** మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద స్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు కొండపల్లి మున్సిపల్ చైర్మన్. శుక్రవారం నాడు రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారులతో కలిసి పవిత్ర సంగమం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షించారు. పవిత్ర సంగమం వద్దకు వేకువజాము నుండి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని సమిష్టి కృషితో భక్తులకు అన్ని ఏర్పాటు చేయాలని కోరారు. మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల శుభ్రత, ఘాట్‌ల నిర్వహణ, తాగునీటి సౌకర్యాలు, చెత్త తొలగింపు చేయాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు పూర్తి భద్రత ఏర్పాట్లు చేరాలి లాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చనుమోలు నారాయణరావు, ఇబ్రహీంపట్నం సీఐ చంద్రశేఖర్, తాసిల్దార్ వై వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ వెంకటరత్నం ఏఈ మౌస్మి గనియా, పాల్గొన్నారు.

## కుటుంబమే ప్రాముఖ్యం



కలసుంటే మనోహరము
ఒలుకుతుంది అనురాగము
అదే కదా కుటుంబము
ఐక్యతకది ప్రతిభింబము
మనస్పర్థలు నశిస్తే
ప్రేమపూలు వికసిస్తే
ఉదయించును సంబరము
తాకుతుంది అంబరము
విలువైనది కుటుంబము
అత్యంత ప్రాముఖ్యము

ఇవ్వాలి ప్రాధాన్యత
నెరవేర్చాలి బాధ్యత
బాగుంటే కుటుంబాలు
బాగుపడును జీవితాలు
అగును భూతల స్వర్గము
అక్షరాలది సత్యము

**-గద్వాల సోమన్న,**
గణితోపాధ్యాయుడు,
ఎమ్మిగనూరు, సెల్:9966414580

## మెగా కంటి వైద్య శిబిరాన్ని ఘనంగా ప్రారంభించిన ముప్పిడి నాగేశ్వరరెడ్డి!

**రెడ్డిగూడెం, ఫిబ్రవరి 13,(వార్తాప్రభ ప్రతినిధి ):** రెడ్డిగూడెంలో కంటి వైద్య సేవల కోసం ప్రజల వెల్లువ శిబిర ప్రాంగణం కిటకిటలాడింది. రెడ్డిగూడెం గ్రామంలో శుక్రవారం ఉదయం సేవా వాతావరణం నెలకొంది. ఉచిత కంటి వైద్య శిబిరానికి 500 మందికి పైగా ప్రజలు తరలి రావడంతో ప్రాంగణం జనసంద్రంగా మారింది. మహిళలు, వృద్ధులు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరై వైద్య సేవలు పొందేందుకు నమోదు చేసుకున్నారు. ఈ మెగా శిబిరాన్ని యంఎన్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి ఘనంగా ప్రారంభించారు. వేణుగోపాల్ రెడ్డి, బాబు, వెంకటేశ్వరరావు సుబ్బారెడ్డి, చందా, ప్రకాష్, లాజరు, అశోక్ రెడ్డి, రామిరెడ్డి, కరీముల్లా, శ్రీనివాసరెడ్డి, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ,యంఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో"విద్యా సేవలు, వైద్య సేవలు నిరంతరం కొనసాగుతాయి. ప్రజల ఆరోగ్యం, పిల్లల భవిష్యత్తు మా ప్రాధాన్యత" అని స్పష్టం చేశారు. కంచి కామకోటి పీఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో, శంకర కంటి ఆసుపత్రి వైద్య నిపుణుల సహకారంతో ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని రెడ్డిగూడెం ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన కంటి వైద్యం అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు. శిబిరంలో కంటి సంబంధిత అన్ని రకాల పరీక్షలు నిర్వహించడంతో పాటు, అవసరమైన వారికి ఉచిత చికిత్సలు,



శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజల అపార స్పందన ఈ సేవా కార్యక్రమానికి బలాన్నిచ్చిందని, ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని గ్రామాల్లో నిర్వహించేందుకు కృషి చేస్తామని నాగేశ్వరరెడ్డి తెలిపారు. రాజకీయ నాయకుడిగానే కాకుండా సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్న నాయకత్వానికి ఈ శిబిరం మరో నిదర్శనంగా నిలిచింది.

## ఎన్.ఐ.ఆర్.డి లో శిక్షణ పొందిన గ్రూపులను కలవనున్న ఎంపీ కేశినేని శివనాథ్

**● ఎస్.హెచ్.జి మహిళలు స్వయం సమృద్ధి వైపు అడుగులు వేయాలి ● నైపుణ్యాభివృద్ధి శిక్షణ ముగింపు కార్యక్రమంలో కేశినేని జానకి లక్ష్మీ వెల్లడి ● ఎన్.ఐ.ఆర్.డి లో శిక్షణ పూర్తిచేసిన 40 మంది ఎస్.హెచ్.జి మహిళలకు సర్టిఫికేట్లు అందజేత ● హ్యాండ్ మేడ్ పేపర్ ప్రొడక్ట్స్ తయారీ పై శిక్షణ పొందిన 40 మంది ఎస్.హెచ్.జి మహిళలు**

విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి) గత ఏడాది కాలం నుంచి కేశినేని ఫౌండేషన్ ద్వారా హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి ప్రధాన కార్యాలయంలో స్వయం ఉపాధి కి సంబంధించి నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందిన ఎస్.హెచ్.జి మహిళల గ్రూపులతో ఎంపీ కేశినేని శివనాథ్ ఈ నెల 20 నుంచి స్వయంగా కలిసి మాట్లాడతారని కేశినేని ఫౌండేషన్ చైర్మన్, ఎంపీ కేశినేని శివనాథ్ సతీమణి కేశినేని జానకి లక్ష్మీ తెలిపారు. శిక్షణ అనంతరం ఎంటర్ ప్రెన్యూర్స్ గా రాణించేందుకు ఎదురయ్యే సమస్యలను ఎంపీ కేశినేని శివనాథ్ తెలుసుకుని వాటిని పరిష్కరిస్తారని తెలిపారు. హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి ప్రధాన కార్యాలయంలో ఫిబ్రవరి 9వ తేదీ నుంచి మొదలైన హ్యాండ్ మేడ్ పేపర్ ప్రొడక్ట్స్ తయారీ పై శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ ఐదు రోజుల శిక్షణా కార్యక్రమంలో విజయవంతంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ను పూర్తి చేసిన ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 40 మంది ఎస్.హెచ్.జి మహిళలకు సర్టిఫికేట్స్ అందించారు. అంతకుముందు హ్యాండ్ మేడ్ పేపర్ ప్రొడక్ట్స్ తయారీ పై శిక్షణ పొందిన మహిళలందరితో మాట్లాడి శిక్షణలో భాగంగా ఏమి నేర్చుకున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు ఎంపీ కేశినేని శివనాథ్, కేశినేని ఫౌండేషన్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా కేశినేని జానకీ లక్ష్మీ మాట్లాడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 లక్ష్య సాధనలో భాగంగా ప్రతి ఇంటిలో కనీసం ఒక ఎంటర్‌ప్రెన్యూర్ ఉండాలన్న ముఖ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ముందడుగు వేశారని తెలిపారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో ఎంపీ కేశినేని శివనాథ్ తన స్వంత నిధులను వెచ్చించి ఎన్.ఐ.ఆర్.డి లో శిక్షణ ఇప్పిస్తూ ఎస్.హెచ్.జి మహిళలకు చేయూత అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ శిక్షణ లో నేర్చుకున్నది ఆచరణలో పెట్టాలని సూచించారు. ముఖ్యంగా



మహిళలు పుట్టుకతోనే బహుముఖ ప్రతిభ కలవారని, భార్యగా, తల్లిగా, చెల్లిగా అనేక బాధ్యతలు నిర్వర్తించే సామర్థ్యం ఉన్న మహిళలకు ఎంటర్ ప్రెన్యూర్ గా రాణించటం అంత కష్టం కాదని అభిప్రాయపడ్డారు. సరైన మార్గదర్శనం, అవకాశాలు లభిస్తే మహిళలు కూడా విజయవంతమైన వ్యాపారవేత్తలుగా ఎదగగలరని మీరంతా నిరూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్.ఐ.ఆర్.డి సీనియర్ కన్సల్టెంట్ మహ్మద్ ఖాన్, ప్రొఫసర్ డాక్టర్ కతిరేషన్, గాంధీ హ్యాండ్ మేడ్ పేపర్ యూనిట్ అధికారి జె.రవీంద్రరావు, ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి రూరల్ కో-ఆర్డినేటర్ సొంగా సంజయ్ వర్మ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీని సందర్శించిన 'స్వదేశీ జాగరణ మంచ్' జాతీయ కన్వీనర్ సుందరం

**- జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక విధానాలపై ప్రసంగం**



**తిరుపతి:ఫిబ్రవరి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భారతదేశ ఆర్థిక భవిష్యత్తు దేశీయ సామర్థ్యాల బలోపేతం, ఆవిష్కరణల ఆధారిత వృద్ధి, విధాన స్థిరత్వంపై ఆధారపడి ఉంటుందని ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్, ఆర్థిక నిపుణులు, స్వదేశీ జాగరణ మంచ్ జాతీయ కన్వీనర్ ఆర్.సుందరం పేర్కొన్నారు. పన్నులు, కార్పొరేట్ చట్టం, ఆర్థిక విధానంలో నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవమున్న ఆయన శుక్రవారం శ్రీసిటీలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని పరిశ్రమల ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. అతిథికి సాదర స్వాగతం పలికిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, మారుతున్న విధానాలు, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా పరిశ్రమ వర్గాలను చైతన్యవంతులను చేయడానికి సంబంధిత నిపుణులతో తరచూ ఈ తరహా కార్యక్రమాల నిర్వహణ ప్రాముఖ్యతను వివరించారు. 'మారుతున్న గ్లోబల్ పరిస్థితుల్లో భారత ఆర్థిక వ్యవస్థ' అనే అంశంపై ప్రసంగించిన సుందరం, ప్రధానంగా ప్రపంచ ఆర్థిక పరిణామాలు మరియు భారత ఆర్థిక వ్యవస్థలోని నిర్మాణాత్మక బలాలను ప్రస్తావించారు. స్వావలంబన, స్వయం సమృద్ధి, బలమైన సరఫరా గొలుసులు, దేశీయ విలువ సృష్టి ప్రాధాన్యతను వివరించిన ఆయన, దేశ పురోగాభివృద్ధిలో బలమైన పరిశ్రమ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. స్థానిక పరిశ్రమలకు సాధికారత కల్పించడం మరియు విధానాలు, ఆవిష్కరణలు, వ్యవస్థాపకతను ప్రపంచ అవకాశాలతో సమన్వయం చేయడంపై భారతదేశ దీర్ఘకాలిక ఆర్థిక బలం ఆధారపడి ఉంటుందన్నారు. పోటీతత్వం, దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధిని కొనసాగించడానికి అధునాతన తయారీ, డిజిటల్ సాంకేతికతలు, పునరుత్పాదక ఇంధనం, ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలు, వ్యవసాయ సాంకేతికత మరియు బలమైన మౌళిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరాన్ని ఆయన హైలైట్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ పరిశ్రమలకు చెందిన పలువురు సీఈఓలు, ఉన్నతాధికారులు పాల్గొని, భారత తయారీ, వాణిజ్యం, పెట్టుబడులపై గ్లోబల్ ఆర్థిక మార్పుల ప్రభావం అంశాలపై పరస్పర చర్చలు జరిపారు. నూతన వ్యాపార అవకాశాలు, సవాళ్ల పట్ల అభిప్రాయాలు పంచుకున్నారు.

## ఆహార నియమాల వల్ల క్యాన్సర్ దూరం

**- కెయూ ఉపకులపతి ఆచార్య కె రాంజీ**
**- ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యములో క్యాన్సర్ అవగాహన సదస్సు**




**మచిలీపట్నం ఫిబ్రవరి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రోజు వారి ఆహారపు అలవాట్లు మార్చుకోవడం ద్వారా క్యాన్సర్ రాకుండా చూసుకోవడం సాధ్యమవుతుందని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ అన్నారు. మణిపాల్ ఆస్పత్రికి సౌజన్యం తో కృష్ణా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ 1,2,3 ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ల ఆధ్వర్యములో బుధవారం క్యాన్సర్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంక్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్ తో పాటు ఆర్డర్ ల పై కొనుగోలు చేస్తున్న ఆహార పదార్థాల తయారీలో క్యాన్సంI కారక పదార్థాలు ఎక్కువగా వినియోగించడం జరుగుతుందన్నారు. ఇటువంటి ఆహారపు అలవాట్లు మార్చుకోవడం ఎంతైనా అవసరమన్నారు. మహిళలు ముఖానికి పసుపు రాసుకునే అలవాటు మన పూర్వీకులు నేర్పించడానికి ప్రధాన కారణం క్యాన్సర్ రాకుండా పసుపు నిరోధిస్తుందని అన్నారు. రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు మాట్లాడుతూ తొలి దశలో క్యాన్సర్ ను గుర్తిస్తే నివారణ సులభం అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష మాట్లాడుతూ క్యాన్సర్ రాకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం అని చెప్పారు. ఎన్ ఎస్ ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం శ్రావణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మణిపాల్ ఆసుపత్రి క్యాన్సర్ వైద్యులు డా. భవాని, డా. శ్రీదివ్య లు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా క్యాన్సర్ పై అవగాహన కల్పించారు. ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారిణి డా. సల్మా, డా. శేషా రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్యామల గోల్డ్ అధినేత జన్మదినోత్సవం.



**మచిలీపట్నం ఫిబ్రవరి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**బందరు నియోజకవర్గ యాదవ సేవా సంఘ గౌరవ అధ్యక్షులు శ్యామల గోల్డ్ అధినేత బొర్రా శ్రీనివాస్ జన్మదిన వేడుక శుక్రవారం మచిలీపట్నంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా బందరు నియోజకవర్గ యాదవ సేవా సంఘం నాయకులు శ్రీనివాస్ కు శాలువా కప్పి పూలమాలలు వేసి స్వీట్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పల్లపాటి చినబాబు ,గోరిపర్తి రాము ,ఆరేపు లక్ష్మణ కుమార్ ,దేవన బోయిన రాము ,నీలపాల రామకృష్ణ, గంగుల నాంచారయ్య, బోయిన సత్యనారాయణ, బోయిన గంగరాజు, బోయిన రమేష్, బుర్రల మల్లికార్జునరావు యాదవ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాదినేని చిన్న బసవయ్య దశదిన కార్యక్రమంలో ఎమ్మెల్యే



**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 13( వార్త ప్రభ)** పెనుగంచిప్రోలు మండలం, లోని లింగగూడెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మాదినేని వెంకట్రావు తండ్రి చిన్న బసవయ్య ఇటీవల పరమపదించారు. ఈ నేపథ్యంలో వారి నివాసంలో ఏర్పాటు చేసిన దశదిన కార్యక్రమానికి జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) హాజరై, చిన్న బసవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్న బసవయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు.

## విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**- ఏఈఎస్ భార్గవ్.**



**మచిలీపట్నం ఫిబ్రవరి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం జగన్నాధపురం లోని వైష్ణవి కాలేజ్ నందు శుక్రవారం మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కృష్ణాజిల్లా ఏఈఎస్ భార్గవ్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాలు సేవించడం వలన కలిగే దుష్ప్రభావాలను వివరించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే బంగారు భవిష్యత్తుకు దగ్గరగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి జి గంగాధర్ రావు, మచిలీపట్నం ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు, సబ్ ఇన్స్పెక్టర్, సిబ్బంది, సామాజిక కార్యకర్త కరెడ్ల సుశీల, వైష్ణవి కళాశాల ప్రిన్సిపల్ రామాంజనేయులు, మ్యాక్స్ హెచ్ఓడి మురళి, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్, పంచాయతీలకు స్టాంప్, రిజిస్ట్రేషన్ ఫీజులు విడుదల చేయాలి

**జిల్లా రిజిస్ట్రార్ కు ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న వినతి**



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 13 (వార్తా ప్రభ ప్రతినిధి):** ఇబ్రహీంపట్నం మండల పరిషత్, పంచాయతీలకు 2024 - 25, 2025 - 26 సంవత్సరాలకు రావలిసిన స్టాంప్, రిజిస్ట్రేషన్ ఫీజులు విడుదల చేయాలని ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రార్ కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. మండల పరిషత్, పంచాయతీలకు రిజిస్ట్రేషన్ ఫీజులు జమ చేయకపోవడంతో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయని చెప్పారు. వాటిని తక్షణమే చేపట్టి పూర్తి చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇప్పటికైనా స్టాంప్, రిజిస్ట్రేషన్ ఫీజులు విడుదల చేస్తే తక్షణమే పెండింగ్ లో ఉన్న పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తుమ్మలపాలెం సర్పంచ్ బొమ్ము వెంకట రమణ, ఎంపీడీవో శకుంతల తదితరులు పాల్గొన్నారు.

## 17న జాతీయ డి-వార్మింగ్ డే....



**గుడ్లవల్లేరు: ఫిబ్రవరి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జాతీయ డి--వార్మింగ్ డేను ఈ నెల 17వ తేదీన నిర్వహించి విజయవంతం చేసేందుకు సమగ్ర చర్యలు చేపట్టామని గుడ్లవల్లేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.యశస్విని తెలిపారు. శుక్రవారం గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ చేతుల మీదుగా జాతీయ నులి పురుగుల నివారణా పోస్టర్లను ఆవిష్కరించారు. జాతీయ డి--వార్మింగ్ డే సందర్భంగా గుడ్లవల్లేరు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, అంగన్‌వాడీ, ఇతర గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయబడనున్నాయని డాక్టర్ యశస్విని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో పేగు పురుగుల నివారణ, రక్తహీనత తగ్గింపు మరియు శారీరక--మానసిక ఆరోగ్యం మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓలు జి.జగన్మోహనరావు, జి.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు స్మాల్ స్కేల్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ పై వర్క్ షాప్

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 13(వార్తా ప్రభ ప్రతినిధి):** మహిళల ఉపాధిని విస్తృతం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు రైజ్ సెంటర్ లో శనివారం నాడు రైజ్ కేంద్రంలో స్మాల్ స్కేల్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ పై వర్క్ షాప్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు శనివారం నాడు ఉదయం 10 గంటల నుండి ట్రైనింగ్ కార్యక్రమ లో పాల్గొనాలని కోరారు. ఎవరికైనా ఆసక్తి కలిగిన మహిళలు మహిళలు రైస్ సెంటర్ గుంటుపల్లి హై స్కూల్ నందు రిజిస్టర్ చేయించుకోవలసినదిగా కోరడమైనది. వివరాలకు 7386542199 నంబర్ ను సంప్రదించగలరు.

## రహదారుల భద్రత మనందరి బాధ్యత....



**గుడ్లవల్లేరు:ఫిబ్రవరి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రహదారుల భద్రత మనందరి బాధ్యత అని గుడ్లవల్లేరు ఎస్.ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ అన్నారు. గుడ్లవల్లేరు ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ పాఠశాలలో శుక్రవారం 6నుండి 9 వ తరగతి విద్యార్థులకు ఆయన అవగాహనా సదస్సును నిర్వహించారు. రోడ్డు మీద నడిచేటప్పుడు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలలన్నారు. ఆడపిల్లల భద్రత విషయంలో జాగ్రత్తగా ఉండాలలన్నారు. మహిళలపై దుశ్చర్యలు, సైబర్ నేరగాళ్ల నేరాలు ఎక్కువవుతున్న ఈ తరుణంలో జాగ్రత్త వహించాలని సూచించారు. డ్రగ్స్ విషయంలో విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, ప్రిన్సిపల్ వి.ఎ.కుంజుమన్, వైస్ ప్రిన్సిపాల్ జి.ఎం.సత్యబాబు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు సరూర్ నగర్ డివిజన్లో పవర్ షట్‌డౌన్.

**- సరూర్నగర్ డివిజన్ డిఇ ఫరహత్ అలీ.**



**ఎల్బీనగర్/వార్తప్రభ (ఫిబ్రవరి 13):**సరూర్ నగర్ డివిజన్ పరిధిలో 11కేవీ లైన్ మెయింటెనెన్స్ పనుల దృష్ట్యా ఈరోజు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిఇ ఫరహత్ అలీ తెలిపారు.ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ సమయాల్లో మొత్తం 9 ఫీడర్ల పరిధిలోని భగత్‌సింగ్ నగర్, ఆటో నగర్, హయత్‌నగర్, విజయ్‌నగర్ కాలనీ, హైకోర్ట్ కాలనీ, డియర్ పార్క్, బ్యాంక్ కాలనీ, వాంబే కాలనీ తదితర ప్రాంతాలు ప్రభావితమవుతాయని తెలిపారు .విద్యుత్ వినియోగదారులు సహకరించాలని డిఇ విజ్ఞప్తి చేశారు.

# ఆర్జీ1లో అవినీతి సెగలు?!!

**● సింగరేణి ఆ ఆఫీసుపైన ఏసీబీ గురిపెట్టిందా? ● కార్యాలయం చుట్టూ ముదురుతున్న వివాదం ● నిఘా నీడలో నల్ల బంగారు కోట ● బట్టబయలు కానున్న నల్ల సామ్రాజ్యం? ● విజిలెన్స్ వైఫల్యం.. లేక మిలాఖత్? అధికారులపై ఇంటలిజెన్స్ మార్క్ ● త్వరలోనే భారీ ప్రక్షాళన?**

**పెద్దపల్లి/ గోదావరిఖని ఫిబ్రవరి 13 (వార్తాప్రభ ప్రతినిధి)** సింగరేణి బొగ్గు గని సామ్రాజ్యంలో అత్యంత కీలకమైన రామగుండం రీజియన్-1 జనరల్ మేనేజర్ కార్యాలయం ప్రస్తుతం అవినీతి ఆరోపణల సుడిగుండంలో చిక్కుకుంది. ఏ క్షణమైనా ఏసీబీ అధికారులు మెరుపు దాడులు చేసే అవకాశం ఉందన్న ప్రచారం పారిశ్రామిక వర్గాల్లో కార్చిచ్చులా వ్యాపిస్తోంది. సదరు ఇద్దరు ముగ్గురు ఉన్నతాధికారులు తన అధికార పరిధిని ఉపయోగించుకుని ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతుండగా, కంపెనీలోని అంతర్గత విజిలెన్స్ విభాగం ఈ అక్రమాలను అడ్డుకోవడంలో ఎందుకు మౌనంగా ఉందనే ప్రశ్నలు యాజమాన్యం తీరును ఎండగడుతున్నాయి. సింగరేణి చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా, నిబంధనలకు విరుద్ధంగా ఒకే అధికారి సుదీర్ఘ కాలం పాటు ఒకే ఏరియాలో పీఠం వేయడం వెనుక రాజకీయ శక్తుల అండదండలు ఉన్నాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి, అంతేకాకుండా సంస్థలో ఎంతో మంది క్వాలిఫైడ్ అధికారులు పదవుల కోసం ఎదురుచూస్తుంటే, కేవలం డిప్యుటేషన్‌పై వచ్చిన వారికే రెడ్ కార్పెట్ పరుస్తూ కీలక బాధ్యతలు అప్పగించడం వెనుక ఉన్న మతలబు ఏమిటని కార్మిక లోకం విస్తుపోతోంది. సింగరేణి సంస్థ పరిధిలోని ఇతర ఏరియాల కంటే కేవలం ఈ కార్యాలయంపైనే పదేపదే ఫిర్యాదులు రావడమే కాకుండా, ఆ అధికారుల అక్రమ సామ్రాజ్యంపై ఇంటలిజెన్స్ వర్గాలు ఇప్పటికే చాప కింద నీరులా నిఘా పెట్టి ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో సింగరేణి కార్యాలయంలో భారీ ప్రక్షాళన జరగడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఇండస్ట్రియల్ బెల్ట్‌లో హస్తం హవా!!

**● మేయర్ పీఠం కాంగ్రెస్ కైవసం ● కుప్పకూలిన గులాబీ కోట ● 60 డివిజన్లలో 38 స్థానాల్లో గెలుపు ● కనీస పోరాట పటిమ చూపని కమలం**



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 13 (వార్తాప్రభ ప్రతినిధి)**పెద్దపల్లి జిల్లాలోని రామగుండం నగరపాలక సంస్థ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యతను ప్రదర్శించి మేయర్ పీఠాన్ని దక్కించుకోవడంలో విజయం సాధించింది. మొత్తం 60 డివిజన్లకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగానే 38 స్థానాలను కైవసం చేసుకొని తన సత్తా చాటగా, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ కేవలం 13 స్థానాలకే పరిమితమై పోటీ ఇచ్చినప్పటికీ వెనుకంజలో నిలిచింది. ఇతర పార్టీల విషయానికి వస్తే ఏఐఎమ్ఐఎమ్ 6 డివిజన్లలో విజయం సాధించగా, భారతీయ జనతా పార్టీ 1 స్థానాన్ని, సిపిఐ 1 స్థానాన్ని ఒక స్వతంత్ర అభ్యర్థి కూడా ఒక స్థానాన్ని గెలుచుకున్నారు. ఈ ఫలితాలతో రామగుండం నగర రాజకీయాల్లో సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయని, గత కొంతకాలంగా ఉన్న రాజకీయ పరిస్థితులకు భిన్నంగా కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్తేజం నెలకొందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఫలితాలు వెలువడగానే కాంగ్రెస్ కార్యకర్తలు నగరవ్యాప్తంగా బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకుంటూ భారీ ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. మరోవైపు ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో బీఆర్ఎస్ సహా ఇతర పార్టీలు తమ ఓటమిపై అంతర్గత సమీక్షా సమావేశాలను ప్రారంభించి లోపాలను సరిదిద్దుకునే పనిలో పడ్డాయి. రామగుండం నగర అభివృద్ధికి ఈ కొత్త పాలకవర్గం ఎలాంటి ప్రణాళికలతో ముందుకు వెళ్తుందోనని స్థానిక ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ ఎన్నికల తీర్పుతో జిల్లా రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ పట్టు మరింత పెరిగిందని స్పష్టమవుతోంది. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతమైన రామగుండంలో కార్మికుల, సామాన్య ప్రజల మద్దతు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడం విశేషం. మేయర్ ఎంపిక ప్రక్రియ కూడా త్వరలోనే పూర్తి కానుండటంతో పాలనలో కొత్త మార్పులు వస్తాయని అందరూ భావిస్తున్నారు. ఈ చారిత్రాత్మక విజయం రాబోయే రోజుల్లో మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలలో కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.

# మంగళగిరిలో మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

**● 15 కంపెనీల ప్రతినిధులు హాజరు ● 344 మంది ఉద్యోగాలకు ఎంపిక ● రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకూ జీతం ● ఎంపిక అయిన వారికి నియామక పత్రాలు అందజేసిన టీడీపీ నేతలు ● నారా లోకేష్ ధన్యవాదాలు తెలిపిన యువతీయువకులు**







**మంగళగిరి టౌన్: ఫిబ్రవరి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మంగళగిరి పట్టణంలోని ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాలు నిరుద్యోగులకు వరంలా మారిందని కూటమి నాయకులు పేర్కొన్నారు. వివిధ రంగాలలో ఉద్యోగ అవకాశాల కల్పనకై మెగా జాబ్ మేళాను వీటిజేఎం ు ఐవిటిఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. పదో తరగతి నుంచి ఇంటర్, డిప్లమా, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, బీఈ, బీటెక్, ఎంటెక్, బీఏ, బీఎస్సీ, బీకామ్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారు. 15 కంపెనీల్లో ఉద్యోగాలకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వాటి ఆధారంగా కంపెనీల్లో రూ.10 వేల మొదలుకొని రూ.50 వేల వరకూ జీతం లభించే ఉద్యోగాలకు 344 మందిని ఎంపిక చేసి నియామక ఉత్తర్వులను కూటమి నాయకుల చేతుల మీదుగా అందజేశారు. నియామక పత్రాలు పొందిన ఉద్యోగస్తులు మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి శ్రీ కె. సంజీవరావు గారు మాట్లాడుతూ, 15 కంపెనీల ద్వారా సుమారు 344 ఉద్యోగావకాశాలు కల్పించడమైనదని, యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని మంచి భవిష్యత్తు కోసం ముందుకు సాగాలని ఆకాంక్షించారు.వీటిజేఎంఐవిటిఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల డా. గోదావర్తి నాగేశ్వరరావు గారు మాట్లాడుతూ మంగళగిరిలో నిర్వహించిన ఈ జాబ్ మేళాలో యువతి యువకులు తమ నైపుణ్యాల ద్వారా ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వం ద్వారా అందించవలసిన శిక్షణ కార్యక్రమాలను ఉపయోగించుకుని తమ నైపుణ్యాలలో మెరుగుపరుచుకోవాలని తెలిపారు.పట్టణ టీడీపీ అధ్యక్షులు పడవల మహేష్, పట్టణ బీజేపీ అధ్యక్షులు మునగాల నాగేశ్వరరావులు మాట్లాడుతూ ఎంపిక అయిన యువతీ, యువకులను అభినందించారు. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే మెరుగైన అవకాశాలు పొందవచ్చని సూచించారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించడమే మంత్రి నారా లోకేష్ లక్ష్యమని తెలిపారు. యువతను సన్మార్గంలో పయనింపజేసేందుకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మంత్రి నారా లోకేష్ సహకారంతో మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించడమే మంత్రి నారా లోకేష్ లక్ష్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ ఉపాధ్యక్షులు వాసా పద్మ, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి అబ్దుల్ మజీద్, వంగర హనుమాన్, నరేంద్ర, స్కిల్ డెవలప్మెంట్, ఎంప్లాయిమెంట్ మరియు సీడప్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా కాటమరాజు జయంతోత్సవం.





**నూజివీడు, ఫిబ్రవరి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** యదు వంశ వీరుడు శ్రీ కృష్ణుడి 23 వ తరం అయ్యిన శ్రీ కాటమరాజు యాదవ్ జయంతి పాల్గుణ శుద్ధ పంచమి సందర్భంగా గురువారం నూజివీడు, టౌన్ చిన్న గాంధీ బొమ్మ సెంటర్ నందు శ్రీ గోకుల కృష్ణ యాదవ సేవా ట్రస్టు (రి. నెం 01/2017) అధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు చిర్రా. కోటేశ్వరరావు , ప్రధాన కార్యదర్శి కాట్రు. తారకేశ్వరరావు మరియు కార్యనిర్వాహక కార్యదర్శి చింతా నాగమణి , ఉపాధ్యక్షులు మానికల గంగాధర్ , ట్రస్ట్ ఫౌండర్ ు ట్రెజరర్ ఆర్ల. గోపాలకృష్ణ , మాజీ అధ్యక్షులు కొలుసు. చంటిమేస్త్రీ, చేకూరి. వెంకట రామయ్య, కొలుసు. సుబ్బారావు, కార్యదర్శులు తట్టుకోల. నాగేశ్వరరావు, నల్లిబోయిన. రంగారావు, కొలుసు. శివయ్య, పుసునూరు. గోపాలకృష్ణ, వేల్పురి. శివాజీ, గోళ్ల. రవి వర్మ , డొక్కు. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ వేడుక మరియు ఆనంద గీతిక.



**విజయవాడ, ఫిబ్రవరి 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ డాన్ బోస్కో ఆర్.సి.యం స్కూల్ 2006 సంవత్సరం పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ డాన్ బోస్కో ఆర్ సి ఎం స్కూల్ ఉపాధ్యాయులు రత్నా టీచర్ గారు పాల్గొనగా పూర్వ విద్యార్థుల నడి వడికను జ్ఞాపకాలను అనుభూతిని తెలియజేసింది. తెలుగు పండితులు ఏసు పాదం మరియు ప్రసాద్ పూర్వ విద్యార్థులను ఆనంద పరిచారు తనం తరం పూర్వ విద్యార్థులందరూ పరిచయ కార్యక్రమం నిర్వహించారు విద్యార్థులందరూ యోగక్షేమాలను తెలుసుకొని జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకొని ఆనందంతో పరవశించారు ఈ కార్యక్రమంలో విజయ్ మరియు ప్రత్యూష్ ,రూపేష్, చందన ఆదర్శం లో నిర్వహించారు.

## కన్నవారికి విన్నవారికి సందడి.. సౌభాగ్యం మన సుందరకాండ







భగవన్నామ ధర్మ ప్రచార మండలి ఆధ్వర్యంలో సరస్వతీ క్షేత్రం పవన్ కుమార్ సమర్పణలో ఫిబ్రవరి 7 శనివారం సాయంత్రం మందపాడు గ్రామంలో నిర్వహించిన సుందరకాండ పారాయణ భజన కార్యక్రమాలు అవధులు లేని అనంత ప్రేమామృత ధారలతో ఆరు గంటపాటు రామాయణ వైభవాన్ని కుంభవృష్టిలా కురిపించారు. మన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి గాయక శిఖామణి మరొకరు ఉన్నారా? లేరు అనిపించారు. ఆయన కూర్చున్న చోటు నుంచి కదలకుండా ఆరు గంటలు యుగ ధర్మాలకు అతీతంగా మాయ మనుషులను ఎలాంటి భ్రమలకు గురిచేస్తుందో కథాను సారంగా వివరించిన తీరు అద్భుతం. త్రేతాయుగంలో రావణ వధ కు కిష్కింధ కాండ తరువాత వచ్చే సుందరకాండ ఎన్నెన్ని సుందరమైన సుగుణాలతో వర్ధిల్లిందో ఉపమానాలతో వర్ణించి చెబుతూ ఎక్కడెక్కడ మాయ కమ్మిందో అక్కడ విష్ణు విష్ణు విష్ణు విష్ణు విష్ణు విష్ణు విష్ణు విష్ణు అని స్మరిస్తే అక్కడి పాపం అక్కడే దగ్ధ మయ్యే రహస్యం భక్తులకు ప్రసాదించిన తీరు అందరినీ ఆకట్టుకుంది.ఆలమందలకు నీటి వసతులతో అలరారి మందపాడు గా పేరు గాంచిన చారిత్రక ఈ గుడివాడ శివారు గ్రామంతో ముడిపడిన తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సరస్వతుల పవన్ కుమార్ ఆనాటి గ్రామ భక్తులను తలుచుకుంటూ అందరినీ కడుపుబ్బా నవ్వించారు. ప్రతీ తల్లి తన బిడ్డలను రామాయణం చదివించి తీర్చిదిద్దాలని అన్నారు. సత్వ రజో తమో గుణాల కలయిక అయిన మానవ జీవితంలో స్థితప్రజ్ఞత ఎలాంటి సుందరమైన ప్రకృతిని తెస్తుందో మైనాక, సురస, లంకిణీ వధ వివరిస్తుంది. వానరుడై ఉన్నా... నారాయణ అంశ అయిన శ్రీరాముడు హనుమను ఆశ్రయించిన క్షణం నుండి సీతాన్వేషణ పూర్తి అయ్యేంత వరకు సాగిన సుందరకాండ కార్యసిద్ధిని సర్వ శుభాలను ప్రసాదించే శక్తిమంతమైన సాధనా సంపత్తి అని చెప్పారు. త్రిజట వృత్తాంతం చెప్పిన విధానం ప్రేక్షకులను పులకింపచేసింది. రావణ మందిరంలో ఆయన రూపానికి ఆకర్షితులై భర్తలను విడిచి వచ్చిన వేలాది సుందరాంగుల వైనాన్ని కళ్ళకు కట్టినట్లు వివరిస్తూ కలియుగంలో భర్త తప్ప అందరూ నచ్చుతారని...చమత్కరిస్తూ సీత ఒడిలో తల పెట్టుకొని పడుకున్న రాముడు చేష్టను కాకి రూపంలో ఇంద్రుడి కుమారుడు ఎలా భిన్నంగా చూసి శాపగ్రస్తుడు అయ్యాడో సోదాహరణంగా వివరించారు. రావణుడు సీతను తన వశం కాకపోతే చంపేస్తానని బెదిరించి నప్పుడు గడ్డిపోచ అడ్డం వేసి సీత చేసిన బోధతో రావణుడు ఎలా ఏడ్చుకున్నాడో తన బ్రహ్మ తేజస్సును ఎలా కోల్పోయాడో అద్భుతంగా పద్య గద్యాలతో వర్ణించారు. ఆంజనేయుడు సీతమ్మ కనిపించక పడిన వేదన, కనిపించాక ఆమెకు తన ఉనికిని , శ్రీ రాముని లక్ష్మణుని రూప వర్ణన అమోఘంగా సాగింది. చిన్న రూపంలో ఉన్న మారుతి సీతమ్మను ఇప్పుడే తీసుకెళ్లి పోయి రామునికి అప్పగిస్తానన్నప్పుడు సీతమ్మ నవ్విన వైనం ...ఇంత చిన్న వాడవు ఎలా తీసుకెళతావు... అయినా అది సరి కాదని తన భర్తే తనను తీసుకువెళ్లాలని సీతమ్మ అంటుంది. అప్పుడు హనుమంతుడు అమ్మా నా అసలు రూపాన్ని చూడమని పంచముఖ ఆంజనేయుడుగా విశ్వరూపాన్ని ప్రదర్శించిన ఘట్టం అమోఘం. రామాంగుళీయకం సీతకు ఇచ్చి ఆమె చూడామణిని తీసుకున్న హనుమ ధన్యుడయ్యాడు. అలాగే అతిలోక సుందరి మండోదరి తర్వాత అంతగా రావణుడు ప్రేమించే అశోక వనంలో ఆంజనేయుడు సృష్టించిన భీభత్సం.. రాక్షసులను సంహరించి రావణ కుమారుడు అక్షయుని వధించిన విధం... అలాగే ఇంద్రజిత్తు ( మేఘనాధుడు) బ్రహ్మ అస్త్రానికి లొంగినట్లు లొంగి రావణుడికి సభకు వెళ్లి...కోతివి ఎలా వచ్చావు అన్నప్పుడు ఒక కోతి ఏం చేసిందో వివరించిన విధానం ప్రేక్షకులను పులకరింపచేసింది. విభీషణుని సూచనతో దూతను చంపకూడదు అని చెప్పగా రావణుడు తోకకునిప్పు అంటించినా సీతమ్మ ప్రార్థనతో అది చల్లగా అనిపిస్తుంది ఆ నిప్పుతో రావణ లంకంతా కాల్చి... చూసి రమ్మంటే కాల్చి వచ్చాడనే సామెత ఎలా వచ్చిందో చెబితే సభ నవ్వులతో నిండిపోయింది. లంక నుండి వెనుతిరిగిన హనుమ జాంబవతాది వీరులతో సుగ్రీవుడి మధువనంలో చేసిన సందడి... రాముని కలిసి "చూసితి సీతా మాతను శ్రీరామా!!" అన్న శుభవార్త చెప్పగా అలిసిన నీవు నా హృదయ పీఠంపై సేదతీరమని రాముడు గుండెలకు హత్తుకున్న క్షణం చెప్తున్న సరస్వతుల పవన్ కుమార్ అచ్చు ఆంజనేయుడు ఆవహించి నట్లుగా పలికారు.సభలో ప్రసంగించిన గాయత్రి పరివార్ అధ్యక్షులు, యోగ మిత్ర నవోదయ శ్రీనివాస్ సుందరకాండ ఒక విశిష్ట కాండం కాగా నిజానికి అది మన శరీరానికి ఆధారభూతమైన మూలాధార చక్రం నుండి సహస్రారం వరకు జరిగే యోగ ప్రయాణమని.... అలాంటి సుందరకాండ చదివినా విన్నా పారాయణం చేసినా జన్మ తరిస్తుందని అన్నారు. సరస్వతి క్షేత్ర నిర్మాణానికి అందరూ చేయూత నివ్వాలని అలాగే ఉగాది పండుగ రోజున సరస్వతీ క్షేత్రంలో జరిగే హనుమాన్ చాలీసా నలభై వేల సార్లు పారాయణలో వేలాది గా మహిళలు పాల్గొని తరించాలని పిలుపునిచ్చారు. రాబోయేది పరాభవ నామ సంవత్సరం అని బిడ్డలందరి క్షేమం కోసం తల్లులందరూ హనుమాన్ చాలీసా పారాయణం చేయాలి అని పవన్ కుమార్ కూడా విన్నవించారు. భారతీయ సంస్కృతిలోని మాధుర్యం చాటుతూ రామాయణం మహాభారతం వంటి ఇతిహాసాలు మన హైందవ ధర్మాన్ని ఆచరించడం ఎలానో తెలుపుతాయని చెప్పారు. భూమికి మూడు రోజుల ముందు పుట్టిన వాడు జాంబవంతుడు అని... రుజువు చూపించమంటే ఆయన ఆధార్ కార్డు లేదని...త్రిజట తన స్వప్నం గురించి మిగిలిన రాక్షస స్త్రీలకు చెప్పి...ఆ రావణుడు పని అయిపోయింది...వాడు నూనె తాగుతూ దిక్కతెలియక అరుస్తున్నాడు....మనం సీతమ్మ తరపున రాముడు పార్టీకి మారిపోతున్నాం....నాగమాత సురస హనుమంతుని మింగేస్తానని నోరు పెంచితే హనుమంతుడు కూడా శరీరం పెంచి పెంచి చిటికెలో అంగుళం అయి సురస పొట్టలోకి వెళ్లి బయటకొచ్చేసిన సందర్భోచితమైన తెలివి చూస్తే...ఎక్కడ నెగ్గాలో కాదు ఎక్కడ తగ్గాలో తెలిసిన వారు ఆంజనేయ స్వామి అంటూ... పవన్ కుమార్ ఛలోక్తులు మహిళలను అలరించాయి. కాస్త భర్తలను తిట్టకుండా ఆదరించడమ్మా వాడు మానసికంగా బలహీనుడు శిశువు లాంటి వాడు...మన కోసం ఎన్ని కష్టాలు నైనా ఓర్చుకోగలిగే వాడని అర్థం చేసుకోండి...కలి మాయ నుంచి బయటపడండి అన్న బోధ నవ్వులు పూయించింది. ఆరుగంటల పాటు మందపాడులో హనమ నామం తాండవం చేయించి రుద్రావతారుడైన హనుమ విష్ణు రూపంలో వెలిసిన రాముని... భూమిలో అయోనిజగా జన్మించిన లక్ష్మీ స్వరూపాయైన సీతను ఒకటిగా కలిపిన సుందరకాండ అమోఘంగా కళ్ళకు కట్టినట్లు వినిపించిన సరస్వతుల పవన్ కుమార్ కు మందపాడు గ్రామస్తులు ఎంతో కృతజ్ఞతలు తెలిపారు.

**డాక్టర్ ఎమ్మెస్వీ సత్యనారాయణ బాబు (కపర్ది),గుడివాడ.**

# ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఐఓటి & రోబోటిక్స్ లపై వర్క్ షాప్



**గుడివాడ,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** స్థానిక గౌరీశంకరపురంలో గల ఆదిత్య డిగ్రీ కళాశాలలో స్టార్ ఫిచ్ ఇన్నోవేషన్స్ కాకినాడ ఆధ్వర్యము లో ఐఓటి & రోబోటిక్స్ లపై వర్క్ షాప్ ను ప్రారంభించినారు. ఆరు రోజులు జరిగే ఈ కార్యక్రమము లో విద్యార్థులకు ఐఓటి & రోబోటిక్స్ వల్ల ఉపయోగాలు వాటిని ఉపయోగించి ప్రాజెక్ట్స్ చేయించడం జరుగుతుంటాను ట్రైనర్లు శివ మణి లు తెలియచేసినారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్ర బాబు మాట్లాడుతూ నేటి ఆధునిక సాంకేతిక యుగంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ రోబోటిక్స్ అత్యంత ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. ఇవి మన దైనందిన జీవితాన్ని పారిశ్రామిక రంగాన్ని పూర్తిగా మార్చివేస్తున్నాయి అంతే గాక ఈ రెండూ కలిసినప్పుడు రోబోలు కేవలం పనులు చేయడమే కాకుండ పరిసరాల నుండి డేటాను సేకరించి స్వయంగా నిర్ణయాలు తీసుకోగలవు. దీనిని ఇంటర్నెట్ ఆఫ్ రోబోటిక్ థింగ్స్ అంటారు అని విద్యార్థులకు తెలియ చేసినారు. జె. సతీష్ చంద్ర మాట్లాడుతూ ఐఓటి & రోబోటిక్స్ రంగంలో ఉద్యోగ అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఈ రంగాలలో స్కిల్స్ ఉన్నవారికి మంచి జీతాలు లభిస్తున్నాయి అని భవిష్యత్తులో ప్రతి చిన్న పరికరం ఇంటర్నెట్‌తో కనెక్ట్ అవుతుంది, కాబట్టి ఈ టెక్నాలజీ యొక్క అవసరం ఇంకా పెరుగుతుంది అని తెలియ చేసినారు. ఈ కార్యక్రమములో లెక్చరర్ శివ సాయి, హార్డ్ వేర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు



**గుడివాడ,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గుడివాడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టబడినవి. గుడివాడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సి.ఐ కొండపల్లి శ్రీనివాస్, గుడివాడ ఎమ్మార్వో కిరణ్, ట్రాఫిక్ ఎస్ఐ నాగరాజు మరియు మున్సిపల్ మరియు ఎండోమెంట్ అధికారుల ఆధ్వర్యంలో స్టేషన్ పరిధిలోని అన్ని శివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా దేవాలయాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, శాంతి భద్రతలు పరిరక్షించబడేలా, ట్రాఫిక్ నియంత్రణ వంటి చర్యలు చేపట్టబడినవి. భక్తులు మహా శివరాత్రి వేడుకలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేలా పోలీసు శాఖ అన్ని విధాలుగా సహకరిస్తుందని అధికారులు తెలిపారు.

# డీఎస్పీ ధీరజ్ వినిల్ ఆధ్వర్యంలో పోలీసులకు పరేడ్ డ్రిల్ నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బంది..



**గుడివాడ,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినిల్ ఆధ్వర్యంలో గుడివాడ ఆర్టీవో కార్యాలయ గ్రౌండ్లో శుక్రవారం పోలీసులకు పరేడ్ నిర్వహించారు. ఈ పరేడ్లో పోలీసులు శిక్షణతో పాల్గొని డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ధీరజ్ వినిల్ పోలీసులకు పలు అంశాలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సి.ఐ లు సోమేశ్వరరావు, శ్రీనివాస్, హనీష్, ఎస్సైలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆకాశవాణి గాయకుడు రాజబాబు బృందాన్ని అభినందించిన అధికారులు





**కాకినాడ,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** ఆకాశవాణి గాయకులు,వ్యాఖ్యాత,నటులు అయిన కరక రాజుబాబును ఎంపిక చేసిన దూరదర్శన్ కేంద్రం,విజయవాడ వారు ఈనెల 15 న మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా ప్రసారమయ్యే కార్యక్రమాల్లో భాగంగా వ్యాఖ్యానంతో పాటు ఆలపించిన భక్తి గీతాలను దూరదర్శన్ కేంద్రంలో రికార్డు చేశారు.గాయకులు రాజుబాబు గానం చేసిన గీతాలకు ప్రముఖ కీ బోర్డు ప్లేయర్ ప్రభల్,ప్రముఖ తబలా విద్వాంసులు సతీష్ కు వాయిద్య సహకారాన్ని అందించగా సహగాయని కల్పవల్లి పాల్గొని భక్తి గీతాలను ఆలపించారు. రికార్డు చేయబడిన ఈ భక్తి సంగీత కార్యక్రమం ఈనెల 15 న ప్రసారం కానున్నది. అనంతరం రాజుబాబు బృందాన్ని దూరదర్శన్ అధికారులు అభినందించగా, ఈ సువర్ణావకాశం కల్పించిన దూరదర్శన్ అధికారులకు ఈ బృందం కృతజ్ఞతలు తెలిపింది.

# గుడివాడలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు





**గుడివాడ,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** శుక్రవారం ఉదయం స్థానిక మానవతా ఆఫీస్ లో జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సంకుల సత్య తులసి దుర్గాంబ ని సన్మానించుకోవడం జరిగింది. చిన్ని మేడంగా పిలువబడే ఆధ్యాత్మిక కళాకారిణిని ఈ రోజు సన్మానించి, వారితో ఆధ్యాత్మిక గీతం పాడించుకొని మానవతా కుటుంబం, అతిథులుగా వచ్చిన మహిళామణులు ఆనందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా పర్యావరణ కమిటీ ఛైర్మన్ దండమూడి జయలక్ష్మి, గుడివాడ మానవతాశాఖ అధ్యక్షులు దండమూడి సీతారామ స్వామి ఉమ్మడి కృష్ణాజిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ పొట్లూరి వీరశేషగిరిరావు పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ దండమూడి సీతారామ స్వామి గుడివాడ మానవతా శాఖ కార్యదర్శి నందమూరి పద్మజ కోశాధికారి బచ్చు రాధాకృష్ణ కార్యవర్గసభ్యులు సామి రామమోహనరావు ఘంటా చంద్రశేఖరరావు మానవతా సభ్యులు బొగ్గవరపు తిరుపతయ్య కోన రామారావు సాంబశివరావు తిరుమల గుప్తా దంపతులు హైమవతి మరడాని వెంకటేశ్వరరావు చింతలూరి సత్యనారాయణ సూరిబాబు అర్జున్ రావు ఏం సత్యనారాయణ సతీష్ నాగేశ్వర శర్మ తదితర సభ్యులు మహిళామణులు అనేక మంది పాల్గొని ఈ సభను జయప్రదం చేశారు.

**స్టేడియం వాకర్స్ క్లబ్ అధ్వర్యంలో.. :** జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక శ్రీరాంపురంలోని శారదా వికాస్ పబ్లిక్ స్కూల్ లో ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు మహిళ వాకర్స్ అసోసియేషన్ల ప్రెసిడెంట్స్ దీవెన, లావణ్య, యార్లగడ్డ సుధారాణీ లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు సరోజినీ నాయుడు జీవిత విశేషాలను గురించి తెలియజేసారు. తొలుత సరోజినీ నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డిస్టిక్ 204 గవర్నర్ లోయ ఈశ్వరవెంకటేశ్వరరావు, క్యాబినెట్ సెక్రటరీ అర్జా ప్రసాద్, కోశాధికారి మెరుగుమాల శివరామకృష్ణ, ట్రస్టు సభ్యులు మొన్నలూరి రామకృష్ణ, బొప్పన కుటుంబరావు, మరడాని వెంకటేశ్వరరావు, పొన్నూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన భవన యజమానులు తక్షణమే బీపీఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలి

## –మున్సిపల్ కమీషనర్ మనోహార్



**గుడివాడ,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** స్థానిక పురపాలక సంఘ పరిధిలో అమలులో ఉన్న బిల్డింగ్ పెనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్) కింద ఇప్పటివరకు మొత్తం 221 దరఖాస్తులు అందినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహార్ తెలిపారు. భవన అనుమతులు లేకుండా లేదా అనుమతులకు భిన్నంగా నిర్మించబడిన భవనాలను చట్టబద్ధం చేసుకునేందుకు ప్రభుత్వం బీపీఎస్ పథకాన్ని అమలు చేస్తున్నదని ఆయన పేర్కొన్నారు. 2019 సంవత్సరంలో అమలులో ఉన్న బీపీఎస్ స్కీమ్‌లో మొత్తం 134 దరఖాస్తులు మాత్రమే వచ్చినప్పటికీ, ఈ సంవత్సరం ప్రవేశపెట్టిన స్కీమ్‌లో ఇప్పటికే 221 దరఖాస్తులు వచ్చియున్నవి, ఇంకా చాలా మంది భవన యజమానులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని తెలిపారు. బీపీఎస్ దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ 11.03.2026గా నిర్ణయించబడినందున, ఇంకా దరఖాస్తు చేయని భవన యజమానులు గడువులోగా తమ దరఖాస్తులు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న సాంకేతిక సమస్యలు అన్ని పరిష్కరించబడినందున, దరఖాస్తు ప్రక్రియ సులభంగా జరుగుతోందని స్పష్టం చేశారు. గడువు ముగిసిన తర్వాత దరఖాస్తు చేయని అనధికార మరియు డివియేషన్ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోబడతాయని, అవసరమైతే కూల్చివేత లేదా చట్టపరమైన చర్యలు కూడా చేపడతామని హెచ్చరించారు. అర్హులైన భవన యజమానులు మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ శాఖను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకుని తక్షణమే బీపీఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ కోరారు.

# భారత కోకిల జయంతి వేడుకలు



**కృత్తివెన్ను,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** భారత కోకిల స్వాతంత్ర్య సమరయోధురాలు కవయిత్రి శ్రీమతి సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లె పాలెం నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు టి వి వి ప్రసాదు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొప్పినీడి సూర్య ప్రకాష్ ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సూర్య ప్రకాష్ మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రి శ్రీమతి సరోజినీ నాయుడు 1879 ఫిబ్రవరి 13 న ప్రస్తుత తెలంగాణా రాష్ట్రంలోనీ హైదరాబాదు లో జన్మించారని,ఈమె స్వాతంత్య పోరాటం నుండి జాతీయ కాంగ్రెస్ మొదటి అధ్యక్షురాలు ఎన్నికైన మొదటి మహిళ అని,తొలి మహిళా గవర్నర్ గా పనిచేసిన మహిళగా కీర్తి గడించారు.బెంగాల్ విభజన వ్యతిరేక పోరాటంలో ఈమె తన సున్నిత ప్రసంగాలతో ప్రజలను స్వాతంత్ర్య పోరాటం లోనికి తీసుకువచ్చారు.ఈమెను ప్రజలంతా "భారత కోకిల"(నైటింగేల్ ఆఫ్ ఇండియా) అని ప్రేమతో పిలుచుకొనేవారని,ఈమె జన్మదినాన్ని పురస్కరించుకొని దేశమంతా ఈ రోజు "జాతీయ మహిళా దినోత్సవం "గా జరుపుకుంటారని సూర్య ప్రకాష్ అన్నారు.ఈ సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఉపాధ్యాయులు యేసు పాదం, విజయ్ కుమార్, మురళీ కృష్ణ, ప్రభ, రేఖ, దుర్గా జ్యోతి, త్రివేణి,మహిళా పోలీస్ దుర్గాభవాని మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ సచ్చి దానంద సరస్వతి స్వామీజీ ఇక లేరు




**రౌతులపూడి /తుని,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** ఆధ్యాత్మిక శిఖరం అంతర్థానమైన వేళ తపోవన ఆశ్రమం తనువంతా నీరైపోయింది.. వనమాలి కంటికి కనపడక గోవు, మావి కలత చెందింది నిండైనా రూపం శాంత స్వరూపం శివైక్యం పొందిన సందర్భాన దక్షిణ కాశీ క్షేత్రం మూగబోయింది తాండవ పరివాహక ప్రాంతం కుమ్మరిలోవ తపోవన ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామీజీ శుక్రవారం తెల్లవారుజామున శివైక్యం పొందారు.శిష్య బృందాన్ని,గో సమూహాన్ని వదిలి కైలాసానికి కదిలిపోయారు.లోక క్షేమానికి సన్యాస జీవితాన్ని ప్రారంభించిన స్వామి ధర్మ, సాంస్కృతిక పరిరక్షణకు జీవిత కాలాన్ని ధారపోశారు.ఆధ్యాత్మిక లోకానికి పున్నమి వెలుగులు నింపి పరమపదించార శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామీజీ బాల్యం నుంచే ఆధ్యాత్మికత వైపు అడుగులు వేశారు. విజయనగరంలోని దిడ్డి వారి వీధిలో 1967లో రామమూర్తి, జానకమ్మ పుణ్య దంపతుల కడుపున స్వామిజీ జన్మించారు. పండితుడైన తండ్రి దగ్గర బాల్యంలోనే వేద అభ్యాసన వైపు నడిచారు. స్వామి వారి బాల్యం విజయనగరం, విశాఖపట్నంలో సాగింది. తన 16వ ఏట శ్రీశ్రీశ్రీ జనార్ధన స్వామి వద్ద సన్యాస జీవితాన్ని ప్రారంభించారు. ఎంతో నిష్ఠతో, నియమముతో బ్రహ్మచర్యాన్ని ఆచరించారు. ప్రస్తుత తెలంగాణలోని ధర్మపురిలో ఆధ్యాత్మిక కేంద్రాన్ని ప్రారంభించిన స్వామీజీ అక్కడ నుంచే పలు ధార్మిక కార్యక్రమాలను నిర్వర్తించేవారు. 2003లో తాండవ పరివాహక ప్రాంతమైన తుని సమీపంలోని కుమ్మరి లోవలో శృంగేరి పీఠానికి అంతర్భాగముగా తపోవన ఆశ్రమాన్ని స్థాపించారు.ఆనాటి నుంచి ఈనాటి వరకు తపోవన ఆశ్రమం ఓ ధార్మిక కోటగా దినదినాభివృద్ధి చెందుతూ ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతోంద తపోవన ఆశ్రమం ఆధ్యాత్మిక వనంగా, గో సంరక్షణ క్షేత్రంగా, ధార్మిక కార్యక్రమాల నిర్వహణ వేదికగా నిండు పున్నమి వెలుగులను విరజిమ్ముతూ వర్ధిల్లుతోంది.. ఈ ఆశ్రమ ప్రాంగణంలో వందలాది గోవుల రక్షణ జరుగుతోంది.. గోవులను బిడ్డలుగా చూసుకునే స్వామీజీ వాటిని ఎంతో ప్రేమతో సాకేవారు.. స్వామివారు ఎక్కడ కూర్చుంటే అక్కడకు గోవులు వచ్చివెళ్ళేవి..తపోవన ఆశ్రమంలో ఉన్న పలు దేవతామూర్తుల ఆలయాల్లో నిత్య కైంకర్యాలు ఎంతో వైభవంగా జరిగేవి.. పుణ్య తిథులు, పవిత్ర రోజుల్లో ఆశ్రమం..ప్రత్యేక పూజలు అభిషేకాలతో పులకించేది... మహాశివరాత్రి రోజున స్వామీజీ నేతృత్వంలో జరిగే వివిధ కార్యక్రమాలు,జాగరణ కాలం ఎంతో ప్రత్యేకమైనది స్వామీజీకి తన తల్లి జానకమ్మపై అమితమైన ప్రేమ.. ఆమె వృద్ధాప్య దశలో స్వామీజీ వద్దకు వచ్చినప్పటి నుంచి ఆమె తుది శ్వాస విడిచే వరకు స్వామీజీ ఎంతో ప్రేమగా చూసుకున్నారు. గత ఏడాది ఆమె కన్నుమూశారు. చాలా మంది ప్రముఖులు స్వామీజీ భక్తులు అశేషమైన సామాన్య భక్తులతో పాటు, పలువురు ప్రముఖులు స్వామీజీకి అనుంగ భక్తులుగా ఉన్నారు.. తెలంగాణలోని మంత్రులు కొండా సురేఖ,దుద్దిల్ల శ్రీధర్ బాబు,అడ్లూరి లక్ష్మణ్ కుమార్తో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు స్వామీజీ భక్తులు...వీరంతా పలుమార్లు తపోవన ఆశ్రమానికి వచ్చి స్వామీజీ ఆశీస్సులు తీసుకునేవారు. అలాగే పలువురు ఐఏఎస్ లు, వివిధ రాష్ట్రాల ఉన్నతాధికారులు స్వామీజీ సేవలో తరించేవారు. సచ్చిదానంద సరస్వతి స్వామీజీ శివైక్యం పొందడంతో ఆయన భక్త సమూహం శోకసంద్రంలో మునిగిపోయింది.ఉదయం నుంచి ఆయన పార్థివ దేహాన్ని సందర్శించేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు.

# జాతీయ స్థాయి ఇన్విటేషన్ బాల్ బాడ్మింటన్ పోటీల ప్రారంభం....



**గుడ్లవల్లేరు,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** మండలంలోని కౌతవరంలో జాతీయ స్థాయి ఆహ్వాన బాల్ బాడ్మింటన్ పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, ఒరిస్సా, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుండి 17జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా అడిషనల్ సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ బి.సత్యనారాయణ, చెన్నై ఐఐటీ రిటైడ్ ప్రొఫెసర్ వెంకట చలపతి, కష్ణాజిల్లా బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెలగపూడి వేంకటేశ్వరరావు విచ్చేశారు. ముఖ్య అతిధి అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తను పుట్టి పెరిగిన పల్లెటూరు కారణంగా చిన్ననాటి నుండి క్రీడల పట్ల మక్కువతో క్రీడలలో పాల్గొంటూ జాతీయ స్థాయిలో క్రీడలలో అనేక బహుమతులు సాధించానన్నారు. క్రీడల పట్ల మక్కువతో ఇప్పటికీ జాతీయ స్థాయిలో పాల్గొంటూ ఫిట్‌గా ఉంటున్నానని చెప్పారు. క్రీడలు వదలకుండా ఆడుతూ మానసికంగా కూడా ఉల్లాసంగా ఉండవచ్చునని చెప్పారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయని ఆర్గనైజింగ్ సెక్రటరీ మత్తి శివ శంకర్ తెలిపారు. ఈ పోటీలు లీగ్ కమ్ సూపర్ లీగ్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో చీఫ్ అడ్వైజర్ వి.దేశపతి, చీఫ్ రిఫరీ సింగరాజు మురళి, సాగునీటి డీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, సమ్మెట నాగేశ్వరరావు, మత్తి మణికుమార్, తూము కష్ణ ప్రసాద్, పింగళి వెంకట సుబ్బారావు, పింగళి లక్ష్మి నారాయణ, గ్రామ పెద్దలు విరివిగా పాల్గొన్నారు.

# లక్ష్మీపురంలో నీటి ఎద్దడి ఎదుర్కొనేందుకు చర్యలు..



**కృత్తివెన్ను,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం గ్రామంలో పెడన నియోజకవర్గం శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు డి సి చైర్మన్ నెక్కంటి భాస్కర రావు పర్యవేక్షణలో మూడు రోజుల నుండి లక్ష్మీపురం గ్రామపంచాయతీ మంచినీటి చెరువును విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి మంచి నీరు నింపుతున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పులగం సుబ్రహ్మణ్యం లక్ష్మీపురం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పులగం చిన్నబ్బులు లక్ష్మీపురం గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు పులగం శ్రీను లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మాజీ చైర్మన్ రావూరి తాతాజీ మరియు కొప్పర్తి చింతారావు శీతాల తాతాజీ కొప్పినేని ఆదిశేషు ప్రత్తిపాటి నాగేశ్వరరావు తదితర కూటమి నాయకులు స్థానిక శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ కు ధన్యవాదాలు తెలియజేశారు....

# అంగటిలో అన్నీ ఉన్నా అల్లుడి నోటిలో శని !



**విస్సన్నపేట,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో శ్రీ కావలి శంకరరావు జిల్లా పరిషత్ హైస్కూల్ నందు 79 లక్షల రూపాయల నిధులతో పీఎం శ్రీ భవనం ఇటీవల నిర్మాణం చేయడం జరిగింది. ఇంటర్నెట్ సౌకర్యంతో గ్రంథాలయం రసాయన మరియు భౌతిక ప్రయోగశాలల ఏర్పాటుకు సంబంధిత పరికరాలు అన్ని వచ్చి ఉన్న దీర్ఘకాలంగా ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోటిలో శని అన్న చందంగా ఉన్నదని సర్వత్రా అనుకుంటున్నారు. హై స్కూల్ ప్రాంగణంలో బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల అందుబాటులో ఉన్న ఈ విద్యా సంవత్సరానికి పీఎం శ్రీ భవనం సేవలు గగనకుసుమాలు కావటం విచారకరమే అని చెప్పాలి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పీఎం శ్రీ భవనం సేవలందించే విధంగా ప్రారంభోత్సవ సంబరాలు చేయాలని పలువురు కోరుతున్నారు.

# వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడుగా కేదారిశెట్టి



**రౌతులపూడి,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** రౌతులపూడి గ్రామ వైసీపీ నాయకులు చిన్ననాటి నుంచి వ్యాపార రంగంలో ఆరితేరిన నాయకుడు కేదరిశెట్టిఇ నాగేశ్వరరావు జిల్లా స్థాయిలో వాణిజ్య ఉపాధ్యక్షులుగా నియమతలయ్యారు. వైఎస్సార్ సీపీ అధినేత వైస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతిపాడు నియోజకవర్గ ఇన్చార్జి ముద్రగడ గిరి ఆశీస్సులు,రాష్ట్ర యువ నాయకులు వాసిరెడ్డి జమీలు అండదండలతో తనకు ఈ పదవి దక్కిందని నాగేశ్వరరావుకు అన్నారు.ఈ పదవి తనకు రావడం అదృష్టంగా భావిస్తున్నానని ఈ పార్టీలో నాకొక మంచి గుర్తింపు లభించిందని మీడియా సమావేశంలో నాగేశ్వరరావు తెలిపారు.అదేవిధంగా రాబోయే రోజుల్లో మరింత బలోపేతానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి సేవ చేస్తానని ఆయన తెలిపారు.

# వాసవీ క్లబ్ కెసిజిఎఫ్ పొట్టి శ్రీరాములు పెడన అధ్యక్షురాలిగా కొమ్మూరి విజయలక్ష్మి



**పెడన,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ వాసవి క్లబ్ కేసి జిఎఫ్ పొట్టి శ్రీరాములు పెడన కార్యవర్గ సమావేశం స్థానిక శ్రీ వాసవి ప్రార్థన మందిరములో శుక్రవారం జరిగినది. ఈ సమావేశమునకు విచ్చేసిన ముఖ్య అతిథి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అసోసియేట్ ప్రధాన కార్యదర్శి అన్నం సాయి సునీత తదితరలకు ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ సాయిబాబు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పెడన పట్టణ వాసవి క్లబ్ కేసిజిఎఫ్ పొట్టి శ్రీరాములు పెడన అధ్యక్షురాలుగా కొమ్మూరి విజయదుర్గ ప్రధాన కార్యదర్శిగా జవ్వాజి మాధవి కోశాధికారిగా తమ్మన అన్నపూర్ణ గౌరవ సలహాదారులుగా కొల్లూరి మంజులత ఉపాధ్యక్షురాలుగా తమ్మన లక్ష్మీ తయారు కార్యదర్శిగా ఆలపాటి లక్ష్మి పిఆర్ఓ గా కొల్లూరి పద్మ తదితరులచే వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కృష్ణాజిల్లా గవర్నర్ మాజేటి హరిప్రసాద్ వైస్ గవర్నర్ మోటమర్రి గోపాలకృష్ణ రీజియన్ సెక్రెటరీ టి రంగనాయకులు జాయింట్ క్యాబినెట్ సెక్రటరీ వలివేటి లక్ష్మి తదితరులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ కేసిజిఎఫ్ పొట్టి శ్రీరాములు పెడన కార్యవర్గ సభ్యులు భవిరిశెట్టి వీర రాఘవయ్య లక్ష్మీ వృద్ధ దంపతులకు నెల రోజులకి సరిపడా నిత్యవసరం వస్తువులు 2000 రూపాయలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) వ్యవస్థాపకులు డా. కొల్లూరి సత్యనారాయణ (చిన్న ) విజయదుర్గ నేతృత్వంలో 2026వ సంవత్సరానికి పి ఎస్ టి లుగా రెండోసారి ఎన్నికైన కొమ్మూరి విజయదుర్గ జవాజి మాధవి తమ్మన అన్నపూర్ణ లకు పూల మొక్కలను ఇచ్చి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు ఆప్స్ వ్యవస్థాపకులు డా. కొల్లూరి. ఈ కార్యక్రమంలో వి ఎన్ మాజేటి షర్మిల వాసవి క్లబ్ పెడన కార్యవర్గ సభ్యులు కొమ్మూరి చంద్రశేఖర్ జవ్వాజి ధర్మారావు జల్లూరి శిరీష దేసు లక్ష్మి కొమ్మూరి సుమన కొల్లిపర సుందరి కొత్త కొత్త ప్రసన్నలక్ష్మి ఆచంట ఉష కొత్త కుమారి సమయ మంత్రి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# బలివే మహాశివరాత్రి ఉత్సవాలపై సమీక్ష..





**నూజివీడు,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. భక్తులకు సౌకర్యాలు, శాంతి భద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, వైద్య సేవలు, పారిశుధ్యం వంటి అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని సూచించారు.. ఆలయ పునర్నిర్మాణానికి రూ.2.50 కోట్లు మంజూరు చేసినట్లు, అవసరమైతే మరిన్ని నిధులు ఇస్తామని తెలిపారు. ఉత్సవాల అనంతరం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి కూడా భక్తుల రద్దీకి అనుగుణంగా భద్రత, సీసీ కెమెరాలు, డ్రోన్లు, ఆర్టీసీ బస్సులు తదితర ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# బి బి ఏ అధ్యక్షులు ఏ.కె.భాషా పర్యవేక్షణలో ప్రశాంతంగా బార్ కౌన్సిల్ ఎన్నికలు

**విజయవాడ,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** ఏపీ బార్ కౌన్సిల్ ఎన్నికలు బెజవాడ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎ.కె. బాషా పర్యవేక్షణలో, ఎలక్షన్ పోలింగ్ ఆఫీసర్ డి.పి. రామకృష్ణ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడినవి. ఈ ఎన్నికల నిర్వహణలో మాజీ అధ్యక్షులు అయిన చంద్రమౌళి, సీనియర్ న్యాయవాదులు కందుల శ్రీనివాస్ రావు, బుచ్చిరావు, అబ్దుల్ మతిన్, కె.బి. సుందర్, వకులా మరియు 40 మంది పైగా సభ్యులు పోలింగ్ ఏజెంట్లుగా సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం మీద సుమారు 40,000కు పైగా ఓటర్లు ఉండగా, బెజవాడ బార్ అసోసియేషన్‌కు చెందిన 2,925 మంది ఓటర్లలో 2,524 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 143 మంది అభ్యర్థులు పోటీ చేయగా, అందులో 18 మంది అభ్యర్థులు బెజవాడ బార్ అసోసియేషన్‌కు చెందినవారు. ఈ ఎన్నికలలో మాజీ బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్ కుమార్ మరియు సుంకర రాజేంద్రప్రసాద్ మళ్లీ పోటీలో పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియ ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు సజావుగా కొనసాగింది. ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న ఎలక్షన్



పోలింగ్ బాక్స్ లకు సీల్ వేయిస్తున్న అధ్యక్షులు వారు మరియు పోలింగ్ ఆఫీసర్

పోలింగ్ ఆఫీసర్ డి.పి. రామకృష్ణ కి, పోలింగ్ ఏజెంట్లకు, అలాగే ఎన్నికల నిర్వహణకు సహాయ సహకారాలు అందించిన సూర్యారావుపేట పోలీస్ అధికారులకు బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.బి.ఏ జనరల్ సెక్రటరీ కె.వి. రంగారావు మరియు గవర్నింగ్ బాడీ సభ్యులు పాల్గొన్నారు.

# ఆధునిక ఆవిష్కరణలను అందిపుచ్చుకుని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఏపీ ఈఎస్జీకాన్ 2026 సదస్సులో పద్మ విభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డి
- విజయవాడ గట్ క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ ఏపీ చాప్టర్ 8వ వార్షిక సదస్సు ప్రారంభం
- గ్యాస్ట్రోఎంటరాలజీ, హెపటాలజీ, జీఐ ఎండోస్కోపీ తదితర అంశాలపై నిపుణుల ప్రసంగాలు






**విజయవాడ,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** వైద్య రంగంలో అందుబాటులోకి వచ్చిన ఆధునిక ఆవిష్కరణలను వైద్యులు అందిపుచ్చుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని పద్మ విభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డి అన్నారు. విజయవాడ గట్ క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏపీ చాప్టర్) 8వ వార్షిక సదస్సు "ఏపీ ఈఎస్జీకాన్ 2026" ఘనంగా ప్రారంభమైంది. నగరంలోని హోటల్ నోవోటెల్ నందు శుక్రవారం ప్రారంభమైన ఈ రెండు రోజుల సదస్సుకు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి చీఫ్ ప్యాట్రన్ గా వ్యవహరించారు. ఈ సదస్సులో ఆయన ప్రసంగిస్తూ, జీర్ణాశయ సంబంధిత వ్యాధులు, కాలేయ సమస్యలు ప్రస్తుతం వేగంగా పెరుగుతున్నాయని, వాటి నిర్ధారణ, చికిత్సల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. కొత్త పద్ధతులు, అత్యాధునిక ఎండోస్కోపీ సాంకేతికతలు, మినిమల్ ఇన్వేసివ్ చికిత్సా విధానాలు రోగులకు తక్కువ నొప్పితో, త్వరితగతిన కోలుకునే అవకాశం కల్పిస్తున్నాయని చెప్పారు. వైద్యులు నిరంతరం శిక్షణ తీసుకుంటూ, తాజా పరిజ్ఞానాన్ని ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సదస్సులో గ్యాస్ట్రోఎంటరాలజీ, హెపటాలజీ, జీఐ ఎండోస్కోపీ తదితర ముఖ్య అంశాలపై దేశంలోని పలువురు వైద్య నిపుణులు ప్రసంగించారు. జీర్ణాశయ వ్యాధుల నిర్ధారణలో నూతన పద్ధతులు, కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలో వచ్చిన అభివృద్ధి, క్యాన్సర్ ప్రారంభ దశలో గుర్తింపు, అడ్వాన్స్ ఎండోస్కోపిక్ టెక్నిక్స్ వంటి విషయాలపై చర్చలు జరిగాయి. యువ వైద్యులకు ఈ సదస్సు ఒక మంచి వేదికగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి 300 మందికి పైగా వైద్యులు, పీజీ విద్యార్థులు, నిపుణులు పాల్గొని శాస్త్రీయ చర్చల్లో పాల్గొన్నారు. ఈ సదస్సుకు ప్యాట్రన్ గా వ్యవహరిస్తున్న ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజీ,లివర్ వైద్య నిపుణులు డాక్టర్ జవ్వాజి సతీష్ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని, ఇలాంటి శాస్త్రీయ సదస్సులు వైద్యుల నైపుణ్యాన్ని పెంపొందించడంలో కీలకంగా ఉంటాయని చెప్పారు. ఆధునిక ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన ఫలితాలను సమాజానికి ఉపయోగపడేలా మార్చడం వైద్యుల బాధ్యత అని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ రెండు రోజుల సదస్సు ద్వారా గ్యాస్ట్రోఎంటరాలజీ రంగంలో తాజా పరిణామాలపై సమగ్ర అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశ్యమని డాక్టర్ సతీష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ప్రమోద్ గార్గ్ చీఫ్ ప్యాట్రన్ గా వ్యవహరిస్తుండగా, డాక్టర్ ఈ. పెదవీర్ రాజు, డాక్టర్ కె. జగన్మోహన్ రావు, డాక్టర్ ఎం. జగన్మోహన్ రావు, డాక్టర్ ఎన్. తిరుమలరావు, డాక్టర్ పి. హరికృష్ణలు ప్యాట్రన్లుగా వ్యవరిస్తున్నారు. అకడమిక్ కోఆర్డినేటర్ గా డాక్టర్ ఐ. నళినీ ప్రసాద్, డాక్టర్ ఐ.ఆర్.ఎస్. గిరినాథ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సదస్సులో ఐఎస్జీ ఏపీ ఆఫీస్ బేరర్లు డాక్టర్ ఎం. కవిత, డాక్టర్ మోహన్ రెడ్డి, ఏపీ ఈఎస్జీకాన్ 2026 నిర్వాహక కమిటీ ప్రతినిధులు డాక్టర్ గోపీకృష్ణ జాలాది, రాజేష్ బత్తిని, రవిశంకర్ తాతా తదితరులు పాల్గొన్నారు.

# కదళీపురవాసాయా.... కైలాసాగ్రనివాసి...



**మోపిదేవి/అవనిగడ్డ,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన కృష్ణా జిల్లా, మోపిదేవి మండలం పెదకళ్ళెపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ దుర్గా నాగేశ్వర స్వామి వారి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల పరిధిలో సుప్రసిద్ధ చారిత్రక ఆలయాల్లో ఒకటిగా కొనసాగుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణలో ఉన్న స్వామి వారి ఆలయంలో ఈ నెల 12 వ తేదీ మాఘ బహుళ దశమి నుండి 20వ తేదీ ఫాల్గున శుద్ధ తదియ వరకు తొమ్మిది రోజుల పాటు స్వామివారి శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. కశ్యప ప్రజాపతి పుత్రులైన అష్టఫణిరాజులు తమ తల్లి శాపం విముక్తికై ఈ క్షేత్రంలో శివుడిని అభిషేకించి,పూజించగా స్వామి ప్రత్యక్షమైనట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఈ క్షేత్ర మహత్యాన్ని అగస్త్య మహాముని శ్రీరామ చంద్రునికి చెప్పినట్లు పద్మ పురాణంలో ఉన్నది. కృష్ణానదీ పాయ దక్షిణ దిశగా ప్రవహిస్తుంది. ఈ క్షేత్రానికి దక్షిణ కాశీగా కూడా పిలుస్తారు. మహా శివరాత్రి , ప్రత్యేక రోజుల్లో ఇక్కడ కృష్ణా నది ఒడ్డున లక్షలాది మంది తరలివచ్చి పితృ దేవతలకు పిండప్రదానం, తిల తర్పణాలు చేయడం ఆనవాయితీ. చల్లపల్లి జమిందారులతో పాటు ఇదే గ్రామానికి చెందిన సుప్రసిద్ధ సాహితీ వేత్తలు సుసర్ల దక్షిణామూర్తి, వేటూరి ప్రభాకర శాస్త్రి, వేటూరి సుందర రామమూర్తి వంటి ఉద్దండులు స్వామివారిని సేవించిన వారిలో ప్రముఖులుగా ఉన్నారు. మాఘ బహుళ త్రయోదశి తత్కాల చతుర్దశి ఆదివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాత్రి శ్రీ మదఖిలాండ కోటి బ్రహ్మండ నాయకులైన శ్రీ దుర్గా పార్వతి సమేత నాగేశ్వర స్వామి వారి వార్షిక దివ్య లీలా కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.






**శ్రీ కదళీపుర క్షేత్ర మహత్యము**

**శ్లో॥ వన్దారు జనమన్దారం భక్తనామ పవిర్గధం ।**
**ఆపన్నార్తి ప్రశమనం దుర్గా నాగేశ్వరం భజే ॥**

పెదకళ్ళేపల్లి గ్రామము, కృష్ణాజిల్లా, మోపిదేవి మండలంలో కృష్ణానదీ తీరానగల పవిత్ర శైవక్షేత్రాలలో నొకటి. క్షేత్రమునకు రంభాపురమనియు, నాగేశ్వర క్షేత్రమగుటచే కర్కోటక క్షేత్రమనియు కూడా పేర్లు కలవు. ఈ క్షేత్రమందు కశ్యప ప్రజాపతి పుత్రులగు కర్కోటక, వాసుకి, తక్షక మొదలగు అష్టఫణిరాజులు తమ తల్లి శాపవిముక్తికై శిలా వేదిక నిర్మించి, ఆచ్ఛాదనగా కదళీ తరువులు బారులుగా గొల్పి దీనికి ఈశాన్య భాగమున నొక సరోవరము త్రవ్వి ఆ జలముచే శివుని అభిషేకించి పూజింపగా స్వామి ప్రత్యక్షమయ్యెను. అంత వారు కంగారుగా "కదళీ కదళీ" అను కేకలు వేసిరి. నేను ఉద్భవించు సమయమున మీరు వేసిన ఈ కదళీ కదళీ లను కేకలతో ఈ క్షేత్రము "కదళీపురము" గా ప్రసిద్ధి చెందును అని చెప్పి స్వామి అంతర్ధానమయ్యెను. ఆనాటి నుండి కాలక్రమేణ యీ క్షేత్రము "కళ్ళేపల్లి" గా నామాంతరము చెందినది. ఈ క్షేత్ర మహత్యము అగస్త్య మహర్షి శ్రీరామచంద్రునకు చెప్పినట్లు పద్మ పురాణమందు గలదు. దీనిని దక్షిణ కాశీగా కూడా పిలుస్తారు. అక్కడ విశ్వేశ్వరుని వలె నిటక్షేత్రస్తుడు నాగేశ్వరస్వామి అక్కడ క్షేత్ర పాలకుడు బిందుమాధువుడైన ఇక్కడ క్షేత్రపాలకుడు శ్రీ మదనగోపాలస్వామి మరియు క్షేత్రజ్ఞుడు కాలభైరవస్వామి. ఇది కదళీ వనం. అది ఆనందన వనం. అక్కడ గల సరస్సు "మణికర్ణికాకుండము" ఇక్కడి తటాకము నాగ సరోవరము. అందువలన యీక్షేత్రాన్నిదక్షిణ కాశీగా పిలుస్తారు. ఈ ఆలయ ప్రాంగణము నందు శ్రీపార్వతీ, శ్రీదుర్గా, శ్రీసుబ్రహ్మణ్యేశ్వర, శ్రీకాలభైరవ, నవగ్రహ ఆలయములు కలవు. సింహవాహనముపై ఉన్న పంచముఖ గణపతి ఈ ఆలయమునందు ఉండుట మరొక విశేషము. ఆలయం ముందు భాగమందు అయిదు అంతస్థుల రాజగోపురము కలదు. ఆలయం లోపల 16 స్థంభములు కల్గిన శ్రీస్వామివారి కళ్యాణ మండపము, యాగశాల, వాహనశాల కలవు. యాత్రికుల సౌకర్యార్థం శ్రీకనకదుర్గా కళ్యాణమండపము నిర్మింపబడినది. త్రాగునీటి సౌకర్యము, విద్యుత్ సౌకర్యములు కలవు. యాత్రికులు ముందుగా ఈ ఆలయంలోని "సత్యస్థంబము"ను చారిత్రక శిలాస్థంబమును దర్శించి ఆ తర్వాతనే శ్రీస్వామివార్లను దర్శించుట యిక్కడి ఆచారము. శాసనములు ఆధారముగా క్రీ॥శ॥ 1292లో ఈ ఆలయం సోమశివాచార్యులచే నిర్మింపబడి క్రీ॥శ॥ 1782లో చల్లపల్లి ప్రభువులైన శ్రీరాజా యార్లగడ్డ కోదండరామన్న ప్రభువుచే ప్రాకారాదులు కట్టబడినట్లు తెలియజేయుచున్నది. నేటికి ఈ ఆలయమునకు చల్లపల్లి ప్రభువులే ధర్మకర్తలుగా ఉన్నారు. మహాశివరాత్రికి శ్రీస్వామి వారి కళ్యాణ మహోత్సవము జరుపబడును...

**-కదళీపురవాసాయ - కైలాసాగ్రనివాసినే**
**పార్వతీ ప్రాణనాథాయ - నాగేశ్వరాయ మంగళం**

# విద్యుత్‌కు నేడు నాలుగు గంటల అంతరాయం...



**గుడ్లవల్లేరు,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** గుడ్లవల్లేరు మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ విషయాన్ని శుక్రవారం ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.బి.శ్రీనివాసరరావు విలేకరులకు తెలిపారు. గుడ్లవల్లేరు మండల పరిధిలోని కౌతవరం సబ్ స్టేషన్ మరమ్మత్తుల పనుల నిమిత్తం ఈ అంతరాయం ఏర్పడనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు అనగా గుడ్లవల్లేరు, కౌతవరం, అంగలూరు, భీమునిగుంట, చంద్రాల, చినగొన్నూరు, చిత్రం, దేశాయిపేట, డోకిపర్రు, గాదేపూడి, జేమ్స్‌పేట, కట్టవానిచెరువు, కూచికాయలపూడి, కూరాడ, లంకాదొడ్డి, మామిడికోళ్ల, మందవాని పాలెం, పద్మాలపాలెం, పసుభొట్లపాలెం, పెదపాలెం, పెంజెంద్ర, పెసరమిల్లి, పోలిమెట్ల, పురిటిపాడు, రెడ్డిపాలెం, శేరీ దగ్గుమిల్లి, శేరీ కల్వపూడి, సింగలూరు, సుబ్బిచెరువు, తాడిచర్ల, ఉలవలపూడి, వడ్లమన్నాడు, వేమవరం, వేమవరప్పాలెం, విన్నకోట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని పేర్కొన్నారు. కావున గృహ, వాణిజ్య, అక్వా వినియోగదారులు గమనించి సహకరించవలసిందిగా ఈఈ శ్రీనివాసరరావు కోరారు.

# పరీక్షా శాలను పరిశీలించిన జేడీ నరసింహులు....



**గుడ్లవల్లేరు,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** మండల కేంద్రంలోని నియోజకవర్గ స్థాయి పశు వ్యాధి నిర్ధారణ పరీక్ష శాలను కృష్ణాజిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎన్.సిహెచ్. నరసింహులు శుక్రవారం పరిశీలించారు. ఈ నియోజకవర్గ స్థాయి పశు వ్యాధి నిర్ధారణ పరీక్షశాలలో గుడివాడ నియోజకవర్గ పరిధిలోని గుడివాడ, గుడ్లవల్లేరు, నందివాడ మండలాలలోని పశు పోషకులు తమ పశువుల రక్తము, మూత్రమును పరీక్షించుకోవచ్చునని తెలియజేశారు. వ్యాధి తీవ్రత పరీక్ష శాలను నిర్ధారణ చేయడం జరుగుతుందని చెప్పారు. నియోజకవర్గ స్థాయి పశు వ్యాధి నిర్ధారణ పరీక్షశాలను ఉపయోగించుకుని తమ పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకుని పాల ఉత్పత్తిలో మేలైన పురోగతి సాధించాలని పశు పోషకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు, డాక్టర్ ఎ.లక్ష్మీనారాయణ, వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ రత్నవీణ పాల్గొన్నారు.

# ఈ నెల 17న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం

- కార్యక్రమం విజయవంతానికి సమన్వయంతో పనిచేయండి
- ఆరోగ్య ఆంధ్ర, ఆరోగ్య భారత్ కు ఇది చాలా ముఖ్య కార్యక్రమం
- అధికారులతో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** జిల్లాలో ఈ నెల 17న చేపట్టే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని సమన్వయ శాఖల అధికారులు సమష్టిగా కృషిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహణపై కలెక్టర్ లక్ష్మీశ వైద్య ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం, పాఠశాల, ఇంటర్మీడియెట్ విద్య తదితర శాఖల అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ 1-19 ఏళ్ల వారికి కార్యక్రమాన్ని అమలుచేయడం జరుగుతుందని, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, పాలిటెక్నికల్ తదితర విద్యాసంస్థల విద్యార్థులకు అల్బెండజోల్ ఇవ్వడం జరుగుతుందన్నారు. దాదాపు అయిదు లక్షల మంది చిన్నారులకు ఈ మాత్రలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఏడాది నుంచి రెండేళ్ల చిన్నారులకు 200 ఎంజీ అల్బెండజోల్ (చప్పరించి మాత్రమే) ఇవ్వాలని.. అదేవిధంగా మిగిలిన వారికి 400 ఎంజీ సింగిల్ డోస్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశంపై సమన్వయ శాఖల అధికారులు, సిబ్బంది అవగాహన పెంపొందించుకోవాలన్నారు. నులిపురుగులు వల్ల పిల్లలు నీరసంగా ఉంటారని, శారీరక మానసిక ఎదుగుదల లోపాలు తలెత్తుతాయని.. ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే తప్పనిసరిగా ఈ మాత్రలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య ఆంధ్ర, ఆరోగ్య భారత్ సాకారానికి ఇది చాలా ముఖ్య కార్యక్రమమన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య అధికారులు, మండల విద్యా శాఖాధికారులు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పర్యవేక్షించాలని, సంబంధిత శాఖల జిల్లా అధికారులు ఈ కార్యక్రమం పకడ్బందీగా జరిగేలా చూడాలని తెలిపారు. వివిధ కారణాల వల్ల ఫిబ్రవరి 17న మాత్రలు తీసుకోని చిన్నారులకు మాప్ అప్ డే రోజున ఈ నెల 24వ తేదీన అల్బెండజోల్ మాత్ర ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం కోఆర్డినేటర్ డా. జి.మాధవి, డీఈవో ఎల్.చంద్రకళ, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి రుక్సానా సుల్తానా బేగం, ప్రోగ్రామింగ్ అధికారులు, సమన్వయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అరాచక పాలనను ఖండించాలి

- కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజల సిద్ధంగా ఉండాలి
- ముద్రగడ నివాసంలో జై భీమ్ రావు భారత్ పార్టీ అధ్యక్షులు జడ శ్రావణ కుమార్.





**కిర్లంపూడి, ఫిబ్రవరి 13 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వ అరాచక పాలనను ప్రజాస్వామ్యవాదులంతా ముక్తకంఠంతో ఖండించాలని, జై భీమ్ రావు భారత్ పార్టీ అధ్యక్షులు, హైకోర్టు మాజీ న్యాయమూర్తి,జడ శ్రావణ్ కుమార్ అన్నారు. కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడిలో మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభంను, ఆయన కుమారుడు, ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముద్రగడ గిరిబాబును జడ శ్రావణ్ కుమార్,మాజీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జడ శ్రావణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిచారు. రాజకీయాలకు సంబంధం లేని మహిళలు, పిల్లల మీద దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. పోలీసుల సమక్షంలోనే ఈ దాడులు జరగడంవిచారకరమన్నారు. ముద్రగడ పద్మనాభం లాంటి వ్యక్తులు మాలాంటి వ్యక్తులకు రోల్ మోడల్ గా ఉన్నంత వరకు రాజకీయాలు స్పష్టంగా,సూటిగా నడిపించడానికి మేము పూర్తి స్థాయిలో మద్దతు తెలుపుతామన్నారు. ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి,హోం మంత్రి మొత్తం కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాథమిక హక్కులను తుంగలో తొక్కి బహిరంగంగా వాళ్ళ సొంత రాజకీయ అజెండాగా అమలు చేస్తున్నారన్నారని ఆరోపించారు. ఇలాంటి సంస్కృతిని ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వానికి 2029లో బుద్ధి చెప్పే రోజు ఖచ్చితంగా ఉంటుందని,కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. ఇంట్లో ఉండగా మహిళలు, చిన్న పిల్లల మీద దాడి చేసి చంపే ప్రయత్నం చేస్తే ఆ ఘటనను ఖండించక పోవడంపై తీవ్రంగా ధ్వజమెత్తారు. ఆ రోజు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి మీద అసెంబ్లీలో ఒక మాట అంటే మేము అందరంమూ చంద్రబాబుకు మద్దతుగా రాలేదా అని గుర్తు చేసారు. రాజకీయాల్లో ఒక తప్పు మాట మాట్లాడితే 53 కేసులు పెట్టి లోపల వేయడమే కాకుండా, వాళ్ళ ఇళ్ల మీద దాడులు చేస్తే రేపటి రోజున ప్రజాస్వామ్యం ఎక్కడ ఉంటుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అంబటి ఇంటి పై దాడి చేసిన వ్యక్తులను ఏ జైల్లో పెట్టారని ముఖ్యమంత్రి చంద్రబాబును జడ శ్రావణ్ కుమార్ ప్రశ్నించారు. తిరుపతి లడ్డులో ఏ విధమైన కల్తీ జరగలేదని సిబిఐ చెప్పినప్పటికీ పదే పదే దుష్ప్రచారం చేయడాన్ని దేశవ్యాప్తంగా ఉన్న వెంకటేశ్వర స్వామి భక్తులు గమనిస్తున్నారన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈసమావేశంలో మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి,వైసిపి నాయకులు గౌతు స్వామి, వాసిరెడ్డి జమీల్, బదిరెడ్డి గోవిందు, గొల్లపల్లి కాశీ విశ్వనాథ్,గొల్లపల్లి సురేష్, రామిశెట్టి నాని,గుడాల వెంకటరత్నం,పలువురు వైసీపీ నాయకులు ఉన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188